ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి


జిల్లా వార్తలు

శనివారం 12 ఏప్రిల్ 2025 | 5



ఓడినా.. గెలవొచ్చు!

కలల సాకారం కోసం పరుగులు తీసే ప్రతి క్షణం జీవితంలో ఓ ప్రయత్నం మాత్రమే. ఉత్తీర్ణులు కాకపోయినా.. మార్కులు తక్కువ వచ్చినా కుంగిపోవాల్సిన పనిలేదు.. తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరమూ లేదు.. ఒక్కసారి మన ముందు తరాన్ని తలచుకోవాలి.. వాళ్లు ఎక్కడ గెలిచారు.. ఓడినా ఒక్కో మెట్టు ఎలా ఎక్కారో అవగాహన చేసుకోవాలి.. ఒత్తిడిని ఒడిసి పట్టుకొని లక్ష్యాన్ని చేరడానికి పరిశ్రమించాలి. ఒక పరీక్ష తప్పితేనో.. ఓ ప్రయత్నం విఫలమైతేనో జీవితం ఆగిపోయినట్టు కాదు! ప్రయత్నించాలి.. ఒక్కో మెట్టు ఎక్కాలి.. అంతే కానీ.. ఓ పరీక్ష తప్పితే.. ఎన్నో ఆశలు పెట్టుకొన్న పెద్దోళ్లను బతికున్నంత కాలం నరకం అనుభవించేలా చేయడం తగదు.. తల్లిదండ్రులకు జీవితాంతం శోకాన్ని మిగల్చడం సరికాదు.. ఇంటర్మీడియట్ అంటే ఎదుగుతున్న వయసు. ఇలాంటప్పుడే ఆటుపోట్లను తట్టుకొనే సామర్థ్యాన్ని కూడగట్టుకోవాలి. అయినా.. ఉందిగా మే నెల.. మార్చిపైన! వాయిదా పద్ధతుంది దేనికైనా! శనివారం ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ సందర్భంగా అందరికీ ఆంధ్రజ్యోతి విజయోస్తు!.



6

కనుల నిండుగా.. స్వామిని చూడగా!



వాడపల్లి వెంకన్న తెప్పోత్సవం శుక్రవారం కన్నుల పండువగా సాగింది. పుష్కరిణిలో తెప్పపై స్వామి అమ్మవార్లు భక్తులకు ప్రత్యేక దర్శనమిచ్చారు.. ఆపద మొక్కులవాడా వాడపల్లి వెంకన్నా అంటూ భక్తజనం కీర్తించారు.. స్వామిని కన్నులారా చూసి తరించారు. ఆ దృశ్యాలివి..

6

బిల్లుకు దారేది!



- బిల్లు.. చెల్లింపు నిల్
- ఉమ్మడి జిల్లాలో రూ.400 కోట్లు
- భారీగా ఆర్‌అండ్‌బీ బకాయిలు
- అమలాపురం రూ.150 కోట్లు
- రాజమండ్రి డివిజన్ రూ.30 కోట్లు
- ప్రభుత్వ బాకీలు రూ.90 కోట్లే
- అత్యధిక బాకీలు వైసీపీలోనివే
- ఇటీవల రూ.290 కోట్లు చెల్లింపు
- పాత బాకీలు ఆపండి
- ప్రభుత్వం తాజా నిర్ణయం
- కాంట్రాక్టర్ల గగ్గోలు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్‌అండ్‌బీ రహదారుల బిల్లుల బాకీలు భారీగా పేరుకుపోయాయి. పూడ్చిన గుంతలు, ఇతర మరమ్మతులకు బిల్లులు ఆగిపోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రహదారులకు సంబంధించి గుంతలు పూడ్చాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో సంక్రాంతి వరకు ఉమ్మడి జిల్లాలో దాదాపుగా ఈ పనులన్నీ పూర్తిచేశారు. ఉమ్మడి జిల్లాలో రహదారుల బిల్లుల బాకీలు రూ.400కోట్లకుపైగానే పేరుకుపోయాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వ హయాంలో గుంతలు పూడ్చిన పనులకు సంబంధించిన బిల్లులు రూ.90 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికలు దగ్గరపడ్డ సమయంలో హడావుడిగా రహదారుల మురమ్మతులు చేపట్టారు. కానీ బిల్లులను మాత్రం జగన్ నిలిపివేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారేసమయానికి ఉమ్మడి జిల్లాలో ఆర్‌అండ్‌బీ బాకీలు రూ.600కోట్ల వరకు ఉన్నాయి. అయితే కాంట్రాక్టర్ల ఆవేదన విన్న సీఎం చంద్రబాబు పాతబాకీల్లో రూ.290 కోట్లు వరకు విడుదలయ్యేలా ఆదేశాలు జారీ చేశారు. ఇవిపోను తాజా పనులతో కలిపి మొత్తం బాకీలు రూ.400 కోట్ల వరకు ఉన్నాయి. అయితే నిధుల కొరతతో గతేడాది వరకు పేరుకుపోయిన బిల్లుల బాకీలు ఇకపై చెల్లించకూడదని సర్కారు తాజాగా నిర్ణయం తీసుకోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు.

అప్పుడలా వదిలేశారు...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు నిర్మించిన కాంట్రాక్టర్లు గగ్గోలు

గత పనులతో మనకేం సంబంధం

పెడుతున్నారు. గత ప్రభుత్వంలో బిల్లులు రాక అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న పరిస్థితులు నెలకొనగా, ప్రభుత్వం మారడంతో కొంత ఒడ్డున పడ్డామని భావిస్తోన్న కాంట్రాక్టర్లు సర్కారు తాజా నిర్ణయంతో తలపట్టుకుంటున్నారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కడికక్కడ రహదారులను గాలికొదిలేశారు. ప్రజలు,పార్టీలు ఆందోళనలు చేసినా అప్పట్లో జగన్ సర్కారు చెవికెక్కించుకోలేదు. అయితే గతేడాది అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో ఓట్ల కోసం అప్పటిక ప్పుడు వైసీపీ ప్రభుత్వం కొన్ని కీలక రహదా రులకు మరమ్మతులు చేపట్టింది. టెండర్లు పిలిచి పనులు చేయించింది. ఎన్నికల ఏడాది కావడంతో చేసిన పనులకు బిల్లులు వస్తాయనే ఆశతో చాలా మంది కాంట్రాక్టర్లు అప్పులు చేసి పనులు చేశారు. తీరా జగన్ ప్రభుత్వం బాకీలు చెల్లించకుండా చేతులెత్తేసింది.ఈలోపు ఎన్నికలు రావడంతో వైసీపీ ఓడిపోయింది. దీంతో కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది. అప్పట్లో చేసిన పనులకు సంబంధించి రూ.600 కోట్ల వరకు బిల్లులు పేరుకుపోయాయి. ఈలోపు ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్లు అధికారుల చుట్టూ తిరిగారు. విషయం సీఎం చంద్రబాబుకు వివరించారు. కాంట్రాక్టర్ల పరిస్థితిని అర్థం చేసుకున్న సీఎం బాకీల్లో కొంత విడుదలకు అధికారులను ఆదేశించారు. దీంతో గతేడాది చివర్లో మొత్తం రూ.600 కోట్ల బాకీలకు గాను రూ.290 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. దీంతో కొంత వరకు కాంట్రాక్టర్లు ఒడ్డున పడ్డారు.ప్రభుత్వం మారిన తర్వాత రహదారుల దుస్థితిపై సమీక్షించిన సీఎం చంద్రబాబు అనేక రహదారుల పరిస్థితి దయనీయంగా ఉండడం గుర్తించారు. ఎక్కడెక్కడ ఏయే రహదారులకు మరమ్మతులు, గుంతలు పూడ్చాలో నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. దీంతో జిల్లాలో గుర్తించిన రహదారుల గుంతలు పూడ్చే పనులు ఈ ఏడాది ఫిబ్రవరి వరకు చేపట్టారు. ఇందుకు రూ.150 కోట్ల వరకు ఖర్చయింది. అయితే వీటికి చెల్లింపులు చేయగా ఇంకా రూ.90 కోట్ల వరకు బాకీలు పేరుకుపోయాయి. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో బిల్లుల చెల్లింపు కష్టంగా మారింది. ఉన్నంతవరకు ప్రభుత్వం అతికష్టంపై ఒక్కో బిల్లు చెల్లించుకువస్తున్నా ఆర్‌అండ్ బాకీలు క దలక పోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు.

అత్యధికం అక్కడే..

మొత్తం పేరుకుపోయిన రూ.400 కోట్ల బాకీల్లో కాకినాడ ఆర్‌అండ్‌బీ డివిజన్‌కు సంబంధించి రూ.40 కోట్ల వరకు బిల్లులు పేరుకుపోయాయి. పెద్దాపురం ఆర్‌అండ్‌బీ డివిజన్ పరిధిలో రూ.35 కోట్లు, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా(అమలాపురం డివిజన్)లో రూ.150 కోట్లు, రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ డివిజన్ పరిధిలో రూ.30 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ.20 కోట్లు, రాజానగరం-సామర్లకోట ఏడీబీ రోడ్డుకు సంబంధించి రూ.30 కోట్లు బకాయిలు ఉన్నాయి. అయితే ఇందులో సింహభాగం గత ప్రభుత్వ హయాంలోవే. మరోపక్క చంద్రబాబు సీఎం అయిన తర్వాత ఉమ్మడి జిల్లాలో అధ్వాన రహదారులపై చలించిపోయారు. యుద్ధ ప్రాతిపదికన వీటిని గుర్తించి గుంతలు పూడ్చేలా ఆదేశాలు జారీచేశారు. ఇందుకు రూ.150 కోట్లకు పైగానే ఖర్చయింది. వీటికి సంబంధించి కొంత చెల్లింపులు చేయగా ఇంకా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.90 కోట్ల వరకు బిల్లులు నిలిచిపోయాయి. అమలాపురం సర్కిల్ పరిధిలో రూ.38 కోట్లు, పెద్దాపురం రూ.12 కోట్లు, రాజమహేంద్రవరం రూ.16 కోట్లు,కాకినాడ ఆర్‌అండ్‌బీ డివిజన్‌లో రూ.24 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇదిలాఉంటే సకాలంలో బిల్లులు రాకపోవడం ప్రస్తుతం కొత్తగా టెండర్లు పిలవడానికి సిద్ధంగా ఉన్న కొన్ని రహదారుల నిర్మాణంపై ప్రభావం చూపుతోంది. కొత్త పనులకు అధికారులు అంచనాలు సిద్ధం చేయగా, టెండర్లు పిలవడానికి పాలనాపరమైన ఆమోదం కూడా లభించింది. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో వీటిని పిలిస్తే కాంట్రాక్టర్లు ఆసక్తి చూపరని అధికారులు భావిస్తున్నారు. దీంతో కొత్త ప్రాజెక్టులు ముందుకు కదలడంలేదు. ఇదిలా ఉంటే కొత్తగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.64 కోట్లు నిధులు మంజూరు చేస్తూ పాలనాపరమైన ఆమోదం ఇచ్చింది. వీటికి త్వరలో టెండర్లు పిలవబోతున్నారు. అయితే గతంలో నిలిచిపోయిన బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు ఒత్తిడి చేస్తుండడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని అధికారులు చెబుతున్నారు. మరోపక్క గతేడాది వరకు నిలిచిపోయిన పెండింగ్ బిల్లులకు సంబంధించి సీఎఫ్ఎంఎస్‌లో లోడ్ చేసిన బిల్లులను సైతం వెనక్కు తీసుకుని చెల్లింపులు నిలిపివేయాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో బాకీల పరిస్థితి ఏంటోనని అధికారులు, కాంట్రాక్టర్లు తలపట్టుకుంటున్నారు.





మంత్రి



చైర్మన్

జనసేనదే.. నిడదవోలు పీఠం

- అవిశ్వాస తీర్మానానికి అవకాశం లేదంటూ కలెక్టర్ ప్రకటన
- మంత్రి దుర్గేష్ ఓటుతో కలిసి 15కు చేరిన కూటమి బలం
- నిడదవోలు మునిసిపాలిటీలో జనసేన పాగా

నిడదవోలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఒక్క కౌన్సిలరూ లేరు..అయినా ప్రస్తుత నిడదవోలు పీఠం జనసేనదే.. వ్యూహ ప్రతి వ్యూహాలతో నిడదవోలు మునిసిపాలిటీపై జనసేన పట్టు సాధించింది.. మంత్రి దుర్గేష్ నియోజకవర్గంలో వైసీపీ జెండా పీకేసి జనసేన జెండా ఎగురవేసింది. నిడదవోలు మునిసిపాలిటీలో మొత్తం 28 మంది సభ్యులు ఉండగా కూటమి తరపున టీడీపీకి ఉన్నది ఒక్క కౌన్సిలర్ మాత్రమే. మిగిలిన 27 మంది వైసీపీ కౌన్సిలర్లే. దీంతో తొలుత పీఠం వైసీపీదే. ఇదిలా ఉండగా గత సార్వత్రిక ఎన్నికల్లో నిడదవోలు నియోజకవర్గంలో కూటమి తరఫున జనసేన నుంచి కందుల దుర్గేష్ ఎన్నికై రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.అనంతరం రాజకీయ పరిణామాలు ఒక్కొక్కటిగా మారిపోయాయి. వైసీపీ కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా జనసేన బాట పట్టారు. మంత్రి దుర్గేష్ వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో వైసీపీ ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానానికి సైతం అవకాశం లేకుండాపోయింది. ఈ మేరకు కలెక్టర్ ప్రకటన విడుదల చేయడంతో నిడ దవోలు మునిసిపాలిటీ జనసేన కైవసం చేసుకుంది. నిడదవోలు మునిసిపాలిటీలోని 28 వార్డులకు మార్చి 15వ తేదీ 2021లో ఎన్నికలు జరగ్గా 27 వార్డుల్లో వైసీపీ కౌన్సిలర్లు విజయం సాధించారు. ఒక్క వార్డులో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. దీంతో నిడదవోలు మునిసిపల్ కౌన్సిల్ వైసీపీ వశమైంది.అప్పటి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు చైర్మన్ పదవీ కాలాన్ని భూపతి ఆదినారాయణకు రెండున్నరేళ్లు.. కామిశెట్టి వెంకట సత్యనారాయణకు రెండేళ్లు.. మిగిలిన కాలం పువ్వల రతీదేవి పదవి చేపట్టేలా ఒప్పందం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో శ్రీనివాస్ నాయుడు ఓటమి పాలై కందుల దుర్గేష్ ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో రాజకీయ పరిణామాలు మారిపోయాయి. చైర్మన్ కుర్చీ వివాదం ముదిరి పాకాన పడింది. ఇదిలా ఉండగా మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణతో పాటు మరో 8 మంది కౌన్సిలర్లు జనసేన కండువా కప్పుకున్నారు. ఇంకా 19 మంది సభ్యుల బలం వైసీపీకి ఉంది.ఈ ఏడాది మార్చి 18వ తేదీ నాటికి కౌన్సిల్ ఏర్పడి నాలుగేళ్లు పూర్తి కావడంతో వైసీపీ కౌన్సిలర్లు చైర్మన్ పీఠంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవకాశం ఇవ్వాలంటూ కలెక్టర్ పి.ప్రశాంతి, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితలకు వినతిపత్రం అందజేశారు. ఈ పరిణామంతో ఒక్కొక్కరుగా మరో నలుగురు కౌన్సిలర్లు జనసేనకు జైకొట్టారు. దీంతో పూర్తిగా జనసేన మెజార్టీ 13కు చేరుకుంది. వీరికి తోడు మరొక టీడీపీ కౌన్సిలర్ ఉండడంతో 14 కాగా మంత్రి దుర్గేష్‌కు కౌన్సిల్‌లో ఓటు ఉండడంతో జనసేన బలం 15కు చేరుకుంది. చైర్మన్ పీఠంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలంటే 15 మంది సభ్యుల బలం ఉండాలి. ప్రస్తుతం వైసీపీ బలం 14కి పడిపోయింది.దీంతో అవిశ్వాసానికి అవకాశం లేకుండాపోయింది. మెజార్టీ కౌన్సిలర్లు లేకపోవడంతో అవిశ్వాస తీర్మానానికి అవకాశం లేదంటూ శుక్రవారం కలెక్టర్ ప్రకటన విడుదల కావడంతో నిడదవోలు మునిసిపాలిటీ జనసేన కైవసం చేసుకుందని జనసేన పార్టీ వర్గాలు ప్రకటించాయి. నిడదవోలు మునిసిపాలిటీలో పరిణామాలపై ఏప్రిల్ 5వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనమే నిజమైంది. ఇదిలా ఉండగా నిడదవోలులో శనివారం మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో జనసేన వర్గాలు నిడదవోలు మునిసిపల్ కౌన్సిల్‌ను జనసేన కైవసం చేసుకుందనే విషయాన్ని బహిరంగంగా ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

కొప్పవరం సర్పంచ్ బులిమోహనరెడ్డి రాజీనామా



అనపర్తి : అనపర్తి మండలం కొప్పవరం గ్రామ సర్పంచ్ కర్రి బులిమోహనరెడ్డి(వైసీపీ) శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం తన రాజీనామా లేఖను ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డికి తన రాజీనామా లేఖను అందజేశారు. తన వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేసినట్టు ఆయన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

1354 ఎకరాల్లో అనధికార లేఅవుట్లు

చైర్మన్ బీవీఆర్ చౌదరి, వైస్ చైర్మన్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రుడా పరిధిలో 1354 ఎకరాల్లో అనధికార లేఅవుట్ల వివరాలు సేకరించామని, ఆయా గ్రామ పంచాయతీ సెక్ర టరీలకు నోటీసులు ఇస్తున్నట్టు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి,వైస్ చైర్మన్ కేతన్‌గార్గ్ తెలిపారు. రుడా ఆఫీసులో శుక్ర వారం రుడా అధికారులతో కలిసి ఆయా పం చాయతీ సెక్రటరీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారం రోజుల్లో పంచాయతీల్లోని అనధికార లేఅవుట్లు గుర్తించి హెచ్చరిక బోర్డు లు పెట్టాలని ఆదేశించారు. ఎవరైనా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే తొర్రేడు, నరేంద్రపురం, హుకుంపేట, బొమ్మూరు,దేవరపల్లి కార్యదర్శులు తీసుకున్న నిర్ణయాలపై వివరణ తీసుకున్నట్టు చెప్పారు. అనధికార లేఅవుట్లను రుడా కార్యాలయం ద్వారా క్రమబద్ధీకరించుకునే వీలుంటుందన్నారు. సమావేశంలో రుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జీవీఎస్ఎస్.మూర్తి, రుడా ప్లానింగ్ ఆఫీసర్ నార్కె డిమిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



రుడా కార్యాలయంలో అధికారులతో చర్చిస్తున్న చైర్మన్ బీవీఆర్ చౌదరి, వైస్ చైర్మన్ కేతన్‌గార్గ్

మహనీయుడు జ్యోతిరావు పూలే

199వ జయంతి సభలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఇద్దరు వ్యక్తులను మాత్రమే మహాత్మ అని పిలుచుకోవడం జరుగుతుందని.. ఒకరు మహాత్మగాంధీ అయితే మరొకరు మహాత్మజ్యోతిరావు పూలే అని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పూలే 199వ జయంతిని నిర్వహించారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వారి పేరు ముందు మహాత్మ అని సంబోధించడమే వారికి సమాజం ఇచ్చిన గౌరవానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. అణగారిన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు పూలే అన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ సత్యధర్మ శోధక మండలి స్థాపించడం ద్వారా సత్యాన్ని నమ్ముకుని ధర్మబద్ధంగా ఎన్నో కార్యక్రమాలు జ్యోతిరావు పూలే చేపట్టారన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మహనీయుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. అనంతరం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 144 మంది బీసీ తూర్పుకాపు, ఈబీసీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు రూ.352 లక్షలు స్వయం ఉపాధి పథకాల అమలు కోసం ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 110 మంది విద్యార్థులకు పూలే సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో రూ.1.10 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు.



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వాసు చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి తదితరులు

ఈ కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్నరాముడు , ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కే.తిలక్ కుమార్,జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బి.శశాంక, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు,నయనాల కృష్ణారావు, ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, ఈఈ మాధవి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారులు ముత్యాల సుబ్బారావు, పి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

4 సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లు | కార్పొరేషన్‌లో అగ్నిప్రమాదం 7

ఓడినా.. గెలవొచ్చు!

- ఆంధ్రజ్యోతి/ రాజమహేంద్రవరం/ పిఠాపురం

- నేడు ఇంటర్ పరీక్షల ఫలితాలు
- విద్యార్థుల్లో తీవ్ర ఉత్కంఠ
- ఒకేసారి ఫస్టియర్, సెకండియర్ రిజల్ట్స్
- అనుకున్న రీతిలో మార్కులు రాలేదని చింత వద్దు
- వెనువెంటనే మళ్లీ రాసేందుకు అవకాశం

ఇంటర్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. పరీక్షలు రాసిన నాటి నుంచి రిజల్ట్స్ కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న విద్యార్థులకు మరికొద్ది గంటల్లోనే ఫలితాలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తున్నాయి. ఈసారి వివిధ వెబ్‌సైట్‌లతోపాటు వాట్సాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే అవకాశాన్ని కల్పించారు. ఒకప్పుడు పరీక్షల ఫలితాలు వస్తున్నాయంటే ఎంతో హడావుడి. ఫలితాలు ప్రకటించిన తర్వాత మరుసటి రోజు పేపర్ చూసి తమ నెంబరు ఉందో లేదో చూసుకునే వరకూ ఉత్కంఠే. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఫలితాలు ప్రకటించిన మరుక్షణం ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. ఇప్పటివరకూ ప్రభుత్వం నిర్దేశించిన వెబ్‌సైట్లు, పత్రికల ద్వారానే ఫలితాలు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు పలు వెబ్‌సైట్లతోపాటు తాజాగా వాట్సాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.



నేటి ఉదయం 11 గంటలకు ఫలితాల వెల్లడి

తొలిసారి వాట్సప్‌లో కూడా..

ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల ఫలితాలను శనివారం ఉదయం 11 గంటలకు ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేయనున్నది. ఫలితాలు https://resultsbie.ap.gov.in వెబ్‌సైట్‌తోపాటు పలు ప్రైవేటు వెబ్‌సైట్లల్లో అందుబాటులో ఉండనున్నాయి. ఆన్‌లైన్‌తోపాటు మన-మిత్ర వాట్సాప్ నెంబరు 95523 00009కు మెస్సేజీ పంపి ఫలితాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. వాట్సాప్‌లో పై నెంబరుకు 'హాయ్' అని మెసేజ్ పంపాలి. రిప్లయ్‌లో వచ్చే ఆప్షన్లలో 'సెలక్ట్ సర్వీస్' ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. తర్వాత 'ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. ఇంటర్ ఫలితాల డౌన్‌లోడ్ ఆప్షన్ కనబడుతుంది. ఫలితాల డౌన్‌లోడ్ ఆప్షన్ యాక్టివ్ అయ్యాక హాల్ టిక్కెట్ నెంబర్ ఎంటర్ అడుగుతుంది. వెంటనే మీ వాట్సాప్ నెంబరుకు ఫలితాలు వెల్లడి అవుతాయి. మార్కుల షార్ట్ మెమో పీడీఎఫ్‌ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈసారి మరింత వేగంగా ఫలితాలు తెలుసుకునే అవకాశం ఏర్పడిందనే చెప్పారు. ఇక ఫలితాలు ప్రకటిస్తామని సమాచారం వచ్చిన దగ్గరనుంచి విద్యార్థుల్లో టెన్షన్ మొదలైంది. తమ ఫలితాలు ఎలా ఉంటాయోనని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అనుకున్న రీతిలో మార్కులు వస్తాయా, ఉత్తీర్ణ సాధిస్తామా అని ఆలోచనలతో సతమతమవుతున్నారు. ఉదయం 11 గంటలకు విద్యార్థులకు ఫలితాలు తెలియజెప్పేందుకు మీసేవా కేంద్రాలతోపాటు ఇంటర్నెట్ సెంటర్లు సిద్ధమయ్యాయి.



● కాసేపు ప్రశాంతంగా ఉండండి..

ఫలితాలు వెలువడే రోజున పిల్లల్లో తీవ్రమైన మానసిక ఒత్తిడి ఉంటుంది. ఏవేవో ఆలోచనలతో సతమతమవుతూ ఉంటారు. ఏ పనిపైనా ధ్యాస ఉండదు. దృష్టి అంతా రిజల్ట్స్‌పైనే ఉంటుంది. నిజమే ఏడాది, రెండేళ్ల పడిన కష్టానికి కాగితంపై ఫలితం చూసుకునే రోజు. కానీ ఇదే జీవితంలో చివరి రోజు కాదు.. ఆ కాగితమే జీవితానికి పరమావధి కానేకాదని గుర్తెరగాలి. శక్తి వంచన లేకుండా ప్రయత్నించడమే మన వంతు.. ఫలితం అనేది మనం శాసించేది కాదని తెలుసుకోవాలి. ఫలితం అనుకున్నట్లు వస్తే హ్యాపీనే. కానీ కాస్త అటుఇటూ అయినా ఆలోచనలు మన అదుపులో ఉంటుకోవడమే జీవితంలో పాస్ కావడానికి నిజమైన ముడిసరుకు. పరీక్షలో పాస్ కాకపోతే ఆకాశం కూలిపోయి తక్షణమే మీద పడిపోదు. ఇంకా మెరుగైన సాధనకు ఉపకరిస్తుంది. సబ్జెక్టుపై పట్టు సాధించడానికి ఆ సమయాన్ని వినియోగించుకోవాలి. ఒకవేళ రకరకాల ఆలోచనలు మిమ్మల్ని చుట్టుముడితే వెంటనే ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నించాలి. యోగా, ధ్యానం, వ్యాయామం వంటివి చేయడం ద్వారా మానసిక శక్తిని పెంపొందించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఎవరో ఎద్దేవా చేస్తారని, మరెవరికో సమాధానం ఎలా చెప్పుకోవాలని.. ఇలాంటి ఆలోచనలను దగ్గరకు రానివ్వద్దు. ఈసారి మంచి ఫలితం సాధించడానికి దారులు వెతకండి, ప్రణాళిక వేసుకోండి. ఇవాళ గొప్ప వాళ్లందరూ ఒక రోజులో ఉన్నత స్థాయికి చేరలేదు. ఎన్నో ప్రయత్నాల ఫలితంగా గొప్ప వాళ్లయ్యారు. ఇంకా చెప్పాలంటే టెన్త్, ఇంటర్‌లలో ఫెయిల్ అయి తర్వాత దూసుకుపోయిన వారే ఎక్కువ. జీవితంలో ఓడిపోయామని అనుకోవడమే అసలు ఫెయిల్యూర్ అని గుర్తు పెట్టుకోండి.

● తల్లిదండ్రులూ సంయమనం



మా అమ్మాయి ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యిందని ఎవరో చెప్పే మాటకు సమాధానంగా మా అబ్బాయి ఫెయిలయ్యాడని చెప్పాల్సి రావడం ఏదో పెద్ద సమస్య నెత్తిన పెట్టినట్టు అనుకోవద్దు. పిల్లలను ఇంట్లో వాళ్లే దగ్గరకు తీసుకోకపోతే కుంగిపోతారు. వారి మానసికస్థితి తీవ్రమైన నిర్ణయాల వైపు మళ్లుతుంది. ముందుగా ఇంటినుంచే ధైర్యం చెప్పడం మొదలవ్వాలి. ఇప్పుడేమైంది.. మళ్లీ ప్రయత్నం చేద్దాం.. ఈసారి కుమ్మేద్దాం.. ఇలా ఉత్సాహపరిచే మాటలు పిల్లలకు తల్లిదండ్రులు చెప్పాలి. అవసరమైతే అదేరోజు కాస్త బయటకు తీసుకెళ్లి వాతావరణాన్ని తేలిక చేసే పని చేయాలి. రిజల్ట్ వచ్చిన తర్వాత పిల్లల అనుపానువులను దగ్గరగా గమనిస్తూ ఉండాలి. సెల్‌ఫోన్లను పరిశీలిస్తూ ఉండాలి. ఏ మాత్రం అనుమానం కలిగినా ఓ స్నేహితుడి మాదిరిగా తండ్రి మారిపోవాలి. దగ్గరకు తీసుకొని జీవన గమనానికి భరోసానివ్వాలి. ఒకవేళ మరీ ఇబ్బందిగా ఉంటే కౌన్సెలింగ్ ఇప్పించాలి. చుట్టాలు కూడా ఏదో జరిగిపోయినట్లు పరామర్శించడం చేయకూడదు. గతంలో తన బిడ్డ ఇంటర్ ఫెయిల్ అయితే ఓ తండ్రి పెద్ద వేడుక చేసి మటన్‌తో భోజనాలు పెట్టారు. తన బిడ్డ ఇంటర్ పరీక్ష తప్పాడేగానీ జీవితాన్నికాదు.. అని సమాజానికి ఓ మేసేజ్ ఇవ్వడమే తన ఉద్దేశమని ఆ తండ్రి చెప్పారు. అందరినీ వేడుక చేయాలని చెప్పడం కాదుగానీ.. పిల్లల మనోధైర్యానికి తల్లిదండ్రులే భరోసా.

● నిపుణులూ అదే చెబుతున్నారు..

ఇంటర్ పరీక్షల్లో అనుకున్న రీతిలో ఫలితాలు రాలేదని విద్యార్థులు క్షణికావేశంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని విద్యావేత్తలు సూచిస్తున్నారు. అనుకున్న రీతిలో మార్కులు రాకపోయినంత మాత్రాన వారి ప్రతిభ ఎక్కడికి పోదని, భవిష్యత్తులో మరింత పట్టుదలతో మార్కులు సాధించాలని తెలిపారు. అదేవిధంగా పరీక్షల్లో ఫెయిలయితే ఇక జీవితం లేదనే భావన వద్దని, పరీక్షల్లో తప్పినా వెంటనే పరీక్షలు రాసే అవకాశం ఉందని వారు గుర్తుచేస్తున్నారు. అంతేతప్ప జీవితం చాలిస్తే మన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత బాధపడతారో ఆలోచించాలని వారు సూచిస్తున్నారు. ఫలితం విద్యార్థి జీవితంలో ఒక భాగమని, అదే జీవితం అనుకోవద్దని చెబుతున్నారు. ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకుంటే ఎక్కడ లోపం ఉందో తెలుసుకుని దానిని అధిగమించేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఏదైనా పరీక్ష తప్పితే వెంటనే ఆ తప్పును సరిదిద్దుకునే అవకాశాన్ని కల్పిస్తారు. లేదంటే ఇష్టమైన ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు పొంది జీవితంలో ఎదిగిన కథలెన్నో మన కళ్ల ముందే ఉంటాయి. ఒక్కసారి పరిశీలించండి.

పసిడి పైపైకి..



- మూడునెలల 10రోజుల్లో రూ.15వేలు పెరిగిన ధర
- 10గ్రాముల 22 క్యారెట్ ధర రూ. 85, 450

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బంగారం ధర రికార్డుస్థాయిలో పెరిగిపోయింది. ఇప్పటివరకూ ఇంత ధరకు చేరడం ఇదే మొదటిసారి వ్యాపారులు, వినియోగదారులు చెబుతున్నారు. జనవరి 1నుంచి ఏప్రిల్ 11వతేదీకి అంటే 3నెలల 11రోజులకు ఏకంగా గ్రాము బంగారం ధర రూ.15000 పెరిగింది. బంగారం ధర జనవరి 1న 22క్యారెట్ 10 గ్రాములు రూ.71,150గా ఉండగా ఇప్పుడు ధర రూ.85,450కు చేరింది. ఇక 24 క్యారెట్ బంగారం ధర జనవరి 1న రూ.78వేలు ఉండగా ఇప్పుడు రూ.95,400 ఉంది.

లక్షకు చేరువలో..

ప్రస్తుతం శుభకార్యాల సీజన్ మొదలవుతోంది. ఈ నేపథ్యంలో పసిడి ధరలు పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇంకో రూ.4,600 పెరిగితే 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.లక్షకు చేరుతుంది. ఈ పరిస్థితుల్లో బంగారం కొనాలా వద్దా అనే డైలామాలో వినియోగదారులు ఉన్నారు. పుత్తడి ధర కొద్దిరోజుల క్రితం కొంత పెరిగి మళ్లీ తగ్గింది. రెండురోజులుగా మళ్లీ పెరుగుతూ, శుక్రవారం నాటికి ఏకంగా రికార్డుస్థాయికి చేరింది. ఇక వెండి ధర గతనెలలో కిలో రూ.లక్ష దాటేసిన సంగతి తెలిసిందే. కానీ ఇటీవల మళ్లీ తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.95,500గా ఉంది. జనవరి 1న కిలో వెండి ధర రూ.88,400 మాత్రమే. ఈ పరిస్థితుల్లో వినియోగదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. బంగారం పెట్టుబడి వస్తువుగా మారిపోవడంతో అందరికీ మక్కువ పెరిగింది. కానీ ధరలు వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నాయి.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో

రెండు పంచాయతీల ఎంపిక



- ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక, గండేపల్లి మండలంలోని తాళ్లూరు పంచాయతీలకు ఏ-గ్రేడ్

ఆత్రేయపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో 2022-23 సంవత్సరానికి సంబంధించి దేశంలో గ్రామ పంచాయతీలు సాధించిన పురోగతి ఆధారంగా కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ సూచీలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో భాగంగా రాష్ట్రంలో నాలుగు పంచాయతీలు ఏ-గ్రేడ్ సాధించినట్లు ప్రకటించారు. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆత్రేయపురం మండలంలోని బొబ్బర్లంక, గండేపల్లి మండలంలోని తాళ్లూరు పంచాయతీలున్నాయి. 76.76మార్కులతో బొబ్బర్లంక గ్రామపంచాయతీ ఏ-గ్రేడ్ సాధించింది.

అభివృద్ధి పథంలో బొబ్బర్లంక



బొబ్బర్లంక గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు పాలకవర్గం పంచాయతీ సిబ్బంది అహర్నిశలు శ్రమించారు. గ్రామంలో ప్రజల అవసరాలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేశాం. కనీస అవసరాలైన తాగునీరు, వైద్యం, అపారిశుధ్య నిర్మూలనకు పాటుపడ్డాం. ఏ-గ్రేడ్ పంచాయతీగా ఎంపిక కావడం ఆనందదాయకం.

-నరాలశెట్టి సుబ్బలక్ష్మి, సర్పంచ్, బొబ్బర్లంక, ఆత్రేయపురం మండలం

వైభవంగా శ్రీవారి తెప్పోత్సవం

- హంసవాహనంలో విహరించిన స్వామి
- ఐదోరోజు వెంకన్న కల్యాణోత్సవాలు





స్వామివారిని గోదావరి వద్దకు ఊరేగింపుగా తీసుకువెళుతున్న దృశ్యం, గోదావరి నదిలో స్వామివారికి తెప్పోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదోరోజు శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే మేలుకొల్పు, తీర్థపు బిందెతో గోదావరి జల సంగ్రహణ, నిత్యార్చన, నిత్యహోమాలు, దిగ్దేవత బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, ద్రవిడ వేద పారాయణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు ఆలయ ప్రదక్షిణ, ప్రధానహోమాలు, దిగ్దేవత బలిహరణ కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులకు పూజల అనంతరం పల్లకిలో మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ గౌతమి గోదావరి నదీతీరానికి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం స్వామివారి తెప్పోత్సవం, కన్నులపండువగా జరిపారు. వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించిన హంస వాహనంలో స్వామివారు కొలువుదీరి పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా మిరుమిట్లుగొలిపే బాణసంచాకాల్పులు ఆకట్టుకున్నాయి. ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు తెప్పోత్సవాన్ని తిలకించారు. గోదావరి ప్రాంతం భక్తజన గోవిందనామస్మరణతో మార్మోగింది. కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బీఈడీ తరగతులు

సమర్థవంతంగా నిర్వహించాలి

● నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



మూల్యాంకనం పరిశీలిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బీఈడీ తరగతులు సమర్థవంతంగా నిర్వహించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ బీఈడీ అధ్యాపకులకు సూచించారు. నన్నయ విద్యాకళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రికార్డుల మూల్యాంకనంను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని 38 అనుబంధ విద్యాకళాశాలలకు చెందిన 2500 రికార్డులు మూల్యాంకనం ప్రక్రియ నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్నారని చెప్పారు. అన్ని విభాగాల కంటే విద్యావిభాగానికి ఎంతో ప్రత్యేకత, ప్రాధాన్యం ఉందన్నారు. భావితరాలకు గురువులుగా బీఈడీ విద్యార్థులు ఉంటారని, విద్యార్థులకు విద్యతోపాటు విలువలను నేర్పించి ఉత్తమంగాతీర్చిదిద్దాలన్నారు. మూల్యాంకనానికి సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విద్యాకళాశాల ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, అధ్యాపకులు ఆర్.సాంబశివరావు, ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫార్మాసిస్టుల

ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో మెరిట్ లిస్ట్

జీజీహెచ్(కాకినాడ), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా నేషనల్ అర్బన్ హెల్త్‌మిషన్ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించి మెరిట్‌లిస్ట్‌ను ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ ప్రకారం ఫార్మాసిస్ట్ (3), పోస్ట్ డేటాఎంట్రీ ఆపరేటర్ (1), లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ ఎల్‌జీఎస్ (4)పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. మెరిట్‌లిస్ట్‌ను శుక్రవారం ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు. అభ్యర్థులు తమ మెరిట్‌లిస్ట్‌ను-http://eastgodavari.ap.gov.in,http://kakinada.ap.gov.in,http://konaseema.ap.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని ఆయన కోరారు.

అరబిందో ఫార్మా కంపెనీలో

పూల్ క్యాంపస్ డ్రైవ్

● 200 మంది హాజరు



వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్‌ను కలిసిన అరబిందో ఫార్మా ప్రతినిధులు

జేఎన్టీయూకే, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో ఐఐపీటీ డైరెక్టరేట్, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీఎస్సీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఐటీఐ, డిప్లమో పూర్తిచేసిన, ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు హైదరాబాద్‌లోని అరబిందో ఫార్మా కంపెనీ శుక్రవారం పూల్ క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించింది. ముందుగా కంపెనీ ప్రతినిధులు ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్‌ను, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్‌ను కలిసి కంపెనీ కార్యకలాపాలను వివరించారు. పూల్ క్యాంపస్ డ్రైవ్‌లో భాగంగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని అరబిందో ఫార్మా కంపెనీ ఫౌండేషన్ స్కిల్‌డవలప్‌మెంట్ సెంటర్లో నాలుగు నెలల పాటూ స్టయిఫండ్‌తో కూడిన శిక్షణనిచ్చి కంపెనీకి చెందిన యూనిట్లలో ఉద్యోగాలిస్తామన్నారు. 300 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు రిజిస్ట్రేషన్ చేసుకోగా పూల్ క్యాంపస్ డ్రైవ్‌కు 200 మంది హాజరయ్యారని వారిలో 150 మంది ఆన్‌లైన్ పరీక్షలో అర్హత సాధించి టెక్నికల్ రౌండ్‌కు ఎంపికైనట్లు ఐఐపీటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీటీ కృష్ణ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను త్వరలో వెల్లడిస్తామని కంపెనీ ప్రతినిధులన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ టెక్నాలజీస్ డైరెక్టర్ కె.పద్మప్రియ, కంపెనీ మేనేజర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.



కళాకారుల నృత్యం





ఎదుర్కోలు దృశ్యం



పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు



ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

కార్పొరేషన్ కార్యాలయంలో

అగ్నిప్రమాదం

మంటలు ఆర్పిన సెక్యూరిటీ



దగ్ధమైన టేబుల్, రికార్డులు



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లోని కొన్ని పాత వస్తువులు నిల్వ చేసిన బిల్లు కలెక్టర్ల విభాగం గదిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయ్యి అగ్నిప్రమాదం సంభవించింది. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో ఈ గదిలో గోడకు అమర్చిఉన్న సైడ్ ఫ్యాను గుండా నిప్పులు చెలరేగి కింద ఉన్న పాత టేబుల్, దానిపై ఉన్న పాత ఫైల్స్ (వ్యర్థమైనవి) పాక్షికంగా దగ్ధమయ్యాయి. మంటల పొగ రావడంతో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై ఫైర్ సేఫ్టీ గ్యాస్‌తో మంటలను అదుపుచేశారు. ఘటనలో పాక్షిక నష్టం జరిగింది. అయితే అదే రూమ్‌లో ఇంకా పాత ఫైల్స్, సెంట్రల్ ఏసీ అవుట్‌డోర్ కంప్రెజర్ల భద్రపరిచే పెద్దపెద్ద కాగితపు అట్ట బాక్సులు, ఫర్నీచర్ ఉంది. వెంటనే స్పందించకపోతే క్షణాల్లో దగ్ధమై పెద్దప్రమాదమే జరిగి ఉండేది.

డీఎల్‌డీవో కార్యాలయానికి రంపచోడవరం పీఆర్ అతిథిగృహం కేటాయింపు

రంపచోడవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న పీఆర్ అతిథి గృహాన్ని డివిజనల్ స్థాయి డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయానికి కేటాయించినట్టు జిల్లా పరిషత్ ముఖ్య కార్యానిర్వాహణాధికారి వీవీఎస్ లక్ష్మణరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ గృహాన్ని ప్రభుత్వం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కోసం కోరుతూ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి గతంలో జిల్లా పరిషత్ సీఈవోకు గతంలో లేఖ రాశారు. ఆ లేఖను పరిశీలించిన సీఈవో ఎమ్మెల్యేకు కేటాయించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. కాగా అదే అతిథి గృహంలో వైసీపీ ఎమ్మెల్సీ వైసీపీ జట్పీటీసీ కార్యాలయం నడుస్తుండడంతో వివాదంగా మారింది. దీనిపై శుక్రవారం వివిధ పత్రికల్లో జిల్లా పరిషత్ సీఈవోపై వచ్చిన కథనాలపై ఆయన వివరణ ఇచ్చారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పంచాయితీ కార్యదర్శి ఇచ్చిన సూచనల మేరకు పీఆర్ అతిథి గృహాన్ని డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారికి కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు.

సారూ... మరిచారా రూలు!



మీకు రూల్స్ పాటించడమే వచ్చు.. మాకు బ్రేక్ చేయడం కూడా వచ్చు.. ఇది ఓ సినిమాలోని పోలీసు డైలాగ్. ఈ ఫొటో చూస్తుంటే ఆ డైలాగ్‌ని నిజం చేసినట్టుంది కదండి!. హెల్మెట్ లేదు.. బండికి నెంబరు లేదు.. సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ.. ఒక చేత్తో డ్రైవింగ్ చేస్తూ ఓ పోలీసు అధికారి యూనిఫామ్‌లో బుల్లెట్‌పై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు రోడ్డులో వెళ్తూ కనిపించిన వైనమిది. రూల్స్ సాధారణ ప్రజలకే గానీ మాకు కాదన్నట్టు ఉన్న అధికారి వ్యవహార శైలి చూసి అటుగా వెళ్తున్నవారు విస్తుపోయారు.

–రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

ఉత్సాహం.. ఉరకలు..

- చేబ్రోలులో గుర్రాల పరుగు ప్రదర్శన పోటీలు
- భారీగా తరలివచ్చిన ప్రజలు, కిక్కిరిసిన రహదారులు
- అనకాపల్లి అశ్వానికి మొదటిస్థానం



చేబ్రోలులో నిర్వహించిన పోటీల్లో పరుగెడుతున్న గుర్రం

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శుక్రవారం రాష్ట్రస్థాయి గుర్రాల పరుగు ప్రదర్శన పోటీలు నిర్వహించగా ఉత్సాహపూరిత వాతావరణంలో సాగాయి. చేబ్రోలు బైపాస్‌రోడ్డులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం చెంతనే ఉన్న రహదారిలో సీతారామా ఆలయకమిటీ, జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 30కిపైగా గుర్రాలు పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో తొలిసారి గుర్రాల పోటీలు నిర్వహించడంతో వీటిని తిలకించేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. పరిసర రహదారులన్నీ జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. గుర్రాలు పరుగెడుతుంటే ఉత్సాహంగా వారి వెంట పరుగెత్తేందుకు ప్రజలు ప్రయత్నించడంతో వారిని నియంత్రించడం నిర్వాహకులకు కష్టసాధ్యంగా మారింది. పోటీల్లో తొలి పది స్థానాల్లో నిలిచిన గుర్రాలకు నగదు పురస్కారాలు, షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో అనకాపల్లి, పాయకరావుపేట జనసేన ఇన్‌చార్జిలు గడ్డం బుజ్జి, ఓరుగంటి పెదకాపు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బుర్రా అనుబాబు, ఓరుగంటి దొరబాబు, బుద్దాల చంటి, చల్లా లక్ష్మి, శివ, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పోటీలు తిలకించేందుకు భారీగా తరలివచ్చిన జనసందోహం

విజతలు వీరే...

రాష్ట్రస్థాయి గుర్రాల పరుగు ప్రదర్శన పోటీల్లో నిర్దేశించిన 2.20 కిలోమీటర్ల దూరాన్ని అనకాపల్లి జిల్లా చేనుల అగ్రహారం మణి(జెస్సీ)కి చెందిన గుర్రం 3 నిమిషాల 2 సెకన్ల 18 పాయింట్ల సమయంలో పరుగెత్తి ప్రథమస్థానంలో నిలిచింది. రామన్నపాలెం చోడమాంబిక విక్రమ్ గుర్రం 3-21-08 సమయంలో, అంకుపాలెం మోదమాంబ మురుగన్ గుర్రం 3-21-87 సమయంలో, ఆర్‌ఆర్‌పేట దాడి రాముడు(భగి) గుర్రం 3-22-37, దేవర సింగపూరు సత్యనారాయణ గుర్రం 3-25-54, కోటనందూరు శివరాజు బ్రదర్స్(రాఖి) గుర్రం 3-27-05, సామర్లకోట జగదీష్ రాజా గుర్రం 3-30-17, శివరాజు బ్రదర్స్(చిన్ని) గుర్రం 3-31-11, ఆర్‌ఆర్ పేట దాడి నూర్ హనుమంత్ (చిన్ని) గుర్రం 3-31-92, రామన్నపాలెం చోడమాంబిక రాకెట్ గుర్రం 3-32-65 సమయంలో పరుగెత్తి తొలి పదిస్థానాల్లో నిలిచాయి. బెస్ట్ రైడర్‌గా మణికంఠ ఎంపికయ్యారు.



ప్రథమ విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

అన్నవరంలో సీతారాములకు...

వేడుకగా వనవిహార మహోత్సవం



వనవిహారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రపాలకులైన సీతారాముల దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం వనవిహార మహోత్సవం వేడుకగా జరిగింది. సాయంత్రం 4గంటలకు నవదంపతులైన సీతారాములను, పెళ్లి పెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను కొండపై నుంచి మేళతాలాలతో కొండదిగువన ఉన్న దేవస్థానం ఉద్యానవనానికి తోడ్కొనివచ్చారు. ప్రత్యేక వేదికలపై ఆశీనులు గావించి పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. చతుర్వే పండితులు వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వివాహ బడలికలో ఉన్న నవదంపతులు సేదతీరేందుకు ప్రతీకగా ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం నవదంపతులకు చక్రస్నాన కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 4గంటలకు నాకబలి, దండియాడింపు కార్యక్రమాలు ఉంటాయి.

కలశ పునఃప్రతిష్ఠ పూజలు

అన్నవరం దత్తత దేవాలయమైన నర్సీపట్నం మండలం బలిఘట్టం సత్యదేవుని ఆలయంలో శుక్రవారం కలశ పునఃప్రతిష్ఠ పూజలు వైభవోపేతంగా జరిగాయి. ఆలయ దత్తత సమయంలో కలశప్రతిష్ఠ చేపట్టగా వానరాలు వాటిని ధ్వంసం చేశాయి. విషయం తెలుసుకున్న దేవస్థానం అధికారులు శుక్రవారం అక్కడకు పండితులతో చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఏఈవో కొండలరావు తదితరులు ఉన్నారు.



కలశ పునఃప్రతిష్ఠ నిర్వహిస్తున్న పండితులు

‘లోవ’లో శాస్త్రోక్తంగా మెట్లోత్సవం



ఆలయంలో నిర్మించిన మెట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తుని రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవలో శుక్రవారం మెట్లోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే దివ్య హాజరయ్యారు. ఆమెకు ఆలయాధికారులు, ఈవో విశ్వనాధరాజు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. రూ.30లక్షలతో ప్ర త్యేకమైన రాతితో నిర్మించిన సుమారు 60 మెట్లను పసుపు, కుంకుమ పెట్టి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండే ప్రత్యేకమైన రాతితో మెట్లను దేవస్థానం అధికారులు నిర్మించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో లోవ దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, సుర్ల లోవరాజు పాల్గొన్నారు.

నేడు ఎడ్లపరుగు పోటీలు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు జరగనున్నాయి. సీతారామస్వామి ఆలయకమిటీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగే పోటీల సీనియర్, జూనియర్ విభాగాల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఎడ్ల జతలు ఇప్పటికే చేబ్రోలు చేరుకున్నాయి. చేబ్రోలు అడవి పుంత రోడ్డులో ఉదయం 6 గంటలు నుంచి పోటీలు ప్రారంభవుతాయి.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

తుని రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అన్నవరం రావికంపాడు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు 45ఏళ్ల వ్యక్తిని ఢీకొనడంతో అక్కడకక్కడే మృతిచెందినట్టు రైల్వే పోలీసులు తెలుపుతున్నారు. వివరాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి రైల్వే పోలీసుల తరలించి భద్రపరిచారు. వివరాలు తెలిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు కోరారు.

విరగకాసే.. కనువిందు చేసే

కాకినాడ జిల్లా సామర్లకోట ఏడీబీ రోడ్డులోని పామాయిల్ తోటలో ఓ పనస చెట్టుకు ఏకంగా 132 కాయలు కాసి కనువిందు చేస్తుంది. చెట్టుకు 3 అడుగుల నుంచి సుమారు 50 అడుగుల ఎత్తు వరకూ వివిధ పరిమాణాల్లో పనసకాయలు కాశాయి. అలాగే సామర్లకోట బీబీఆర్ ఉన్నత పాఠశాల ఎదుట వీధిలో కర్రి సూర్యనారాయణకు చెందిన ఇంటి ఆవరణలో చెట్టు మొదలు ఆరు అంగుళాల ఎత్తు నుంచి సుమారు 15 అడుగుల ఎత్తు వరకూ సుమారు 42 పనసకాయలు కాశాయి.

–సామర్లకోట (ఆంధ్రజ్యోతి)





హాకీ చాంపియన్‌షిప్ విజేత కాకినాడ



ట్రోఫీ అందుకుంటున్న కాకినాడ జిల్లా జట్టు సభ్యులు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6 నుంచి 9 వరకు ధర్మవరం శ్రీ సత్యసాయి జిల్లాలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లా జూనియర్ బాలుర హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించి ఫైనల్స్‌లో కాకినాడ జిల్లా జట్టు కడప జిల్లా జట్టుపై 2-0 తేడాతో గెలుపొంది విజేతగా నిలిచిందని జిల్లా హాకీ సంఘ కార్యదర్శి నందు శ్రీనివాసరావు తెలిపారు. జట్టును జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ అభినందించారు. కోచ్‌లు వి.రవిరాజు, నాగేంద్రకుమార్, జిల్లా హాకీ సంఘ అధ్యక్షులు ఏ.బాబ్జి, సంఘ కార్యదర్శి కె.నూకరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు సునీల్, సూరిబాబు, పరశురాం, పరశురాం ఉన్నారు.

ధర్మవరంలో వైభవంగా కలశాల ఊరేగింపు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో అయ్యప్పస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం 108 కలశాలతో ర్యాలీ నిర్వహించారు. గురుస్వాములు, వేలు చంటిల పర్యవేక్షణలో ధర్మవరం అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో శివాలయం వద్ద అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించి అనంతరం 108 మంది కలశాలతో స్వామిని వైభవంగా రథంపై ప్రధాన రహదారిపై ఊరేగించారు. 18 రకాల ద్రవ్యాలతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ర్యాలీలో గ్రామ ప్రముఖులు ఎం.మురళీరాజు, దాట్ల అప్పన్నబాబు, బొల్లు కొండబాబు, ఇందన ఏసుబాబు, నానిపల్లి చంటి, బొడ్డు వెంకటేశ్వరరావు, గంగాధర్ రాయుడు పాల్గొన్నారు.





కాకినాడ జిల్లా ధర్మవరంలో కలశాలతో ఊరేగింపు దృశ్యం

అత్తను కొట్టి చంపుతానని బెదిరించిన కోడలిపై కేసు

కొవ్వూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అత్తను కొట్టి చంపుతానని బెదిరించిన కోడలిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరుకు చెందిన పోలినాటి దుర్గాప్రసాద్‌కు కాకినాడ జగన్నాథపురానికి చెందిన నాగమణితో వివాహం జరిగింది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో 2 ఏళ్లుగా విడిగా ఉంటున్నారు. దుర్గాప్రసాద్ నిడదవోలులో ఉంటున్నాడు. అప్పుడప్పుడు నాగమణి దొమ్మేరులోని అత్త పోలినాటి మంగాదేవి ఇంటికి భర్త గురించి ఆరా తీస్తూ అత్తతో గొడవపడి వెళ్తుంటుంది. ఈనెల 8న నాగమణి, ఆమె అక్క కుమార్తె దేవితో కలిసి వచ్చి అత్తను కొట్టి, చంపుతానని బెదిరించడంతో మంగాదేవి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామన్నారు.

నాలుగు సెమీ మెక్‌నైజ్డ్ ఇసుక రీచ్‌లు

అందరూ టన్నుకు రూ.35 కోట్ చేసిన వైనం

లాటరీలో విజేతలుగా నాలుగు కంపెనీలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి ఇసుక ర్యాంపుల్లో నాలుగు రీచ్‌లకు సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లుగా అనుమతిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో మొత్తం పది సెమిమెకనైజ్డ్ రీచ్‌లను గుర్తించగా అందులో జిల్లా అవసరాల కోసం నాలుగు రీచ్‌లకు టెండర్లు పిలిచారు. బ్రిడ్జిలంక, పక్కిలంక రీచ్‌లకు 43 దరఖాస్తులు, చిడిపికి 42, ఆరికరేవులకు 48, పురుషోత్తపల్లికి 29 మొత్తం 162మంది టెండర్ల దాఖలు చేశారు. అందులో 124 దరఖాస్తులు అర్హత సాధించాయి. కానీ ఈ 124మంది దరఖాస్తుదారులు టన్నుకు రూ.35 మాత్రమే కోట్ చేయడంతో అధికారులు లాటరీ తీశారు. అందులో ప్రక్కిలంక రీచ్ ఎనర్జీవో ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్, డీపీ ర్యాంప్ గాలి సుబ్బరాజు కనస్ట్రక్షన్ కంపెనీకి, ఆరికరేవులను కేవీవీఎస్ఎన్ ఇన్‌ఫ్రా(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, పురుషోత్తపల్లి శ్రీసాయిబాలాజీ కనస్ట్రక్షన్స్‌కు దక్కాయి. ఈ ర్యాంప్‌లను వారం రోజుల్లో నిర్వాహకులకు అప్పగించి ఇసుక తీత ఆరంభిస్తారని జేసీ ఎస్.చిన్నరాముడు, జిల్లా మైన్స్ అధికారి ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు. ఈ ర్యాంప్‌ల నుంచి మొత్తం 24 లక్షల 6 వేల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యమవుతుందని స్పష్టం చేశారు. మునికూడలి పట్టాభూములకు చెందిన ర్యాంప్‌లను కొన్ని కారణాల వల్ల వాయిదా వేశారు. ఇక మరొక ఐదు మెకనైజ్డ్ రీచ్‌లను ఇతర జిల్లాలకు కేటాయించారు. పెండ్యాల రీచ్‌ను పశ్చిమగోదావరి జిల్లా, కుమారదేవం రీచ్‌ను విశాఖపట్నం అవసరాలకు, తాడిపూడి రీచ్ ఏలూరు జిల్లా అవసరాలకు, సింగవరం రీచ్ అనకాపల్లి అవసరాలకు, కాటవరం రీచ్‌ను కాకినాడ అవసరాలకు కేటాయించినట్టు తెలిపారు.

16 గ్రామాలకు ఆర్అండ్ఆర్ ప్రతిపాదనలు సిద్ధం

పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్

ధవళేశ్వరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో చింతూరు పరిధిలో 32 గ్రామాలు ముంపు గ్రామాలుగా గుర్తించి లబ్ధిదారులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలుచేయడానికి ఇప్పటికే 16 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి వారికి అందించాల్సిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రతిపాదనలు తన కార్యాలయానికి అందినట్టు ధవళేశ్వరంలోని ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ వి.అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన 16 గ్రామాలకు ఈనెల 30లోగా గ్రామసభలు నిర్వహించి తుది ప్రతిపాదనలు అందిన వెంటనే ఆర్అండ్ఆర్ కమిషనర్ అనుమతి కోసం పంపనున్నట్టు శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో కలిసిన ముంపు బాధితులకు తెలియజేశారు.

సాగరతీరం.. విన్యాసాలమయం

కాకినాడలో కొనసాగుతున్న ‘టైగర్ ట్రంప్-25’

పాల్గొన్న ఇండియా- అమెరికా దేశాల 1000 మంది త్రివిధ దళాల సభ్యులు



సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట నేవల్ ఎన్‌క్లేవ్‌లో ఇండియా- అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న టైగర్ ట్రంప్- 2025 యాంపీబీఎస్ విన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి. అమెరికాకు చెందిన యుద్ధ నౌకలతో పాటూ ఇండియాకు చెందిన ఐఎన్ఎస్ జలస్వ, ఐరావత్ యుద్ధనౌకలు ఈ విన్యాసాల్లో పాల్గొని యుద్ధ సమయంలో శత్రు దేశాలపై చేసే వీరోచిత పోరాటల ప్రదర్శన, దేశ అంతర్గత భద్రత, విపత్తులు, ఆపద సమయంలో మానవతా సమయం అందించే రెస్క్యూ సమయంలో అందించే సేవలను కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. తీరప్రాంతంలో స్పేస్ ఐఆర్ఎఫ్‌ను భద్రపరచడంతో పాటూ ప్రకృతి వైపరీత్యం, హాస్పిటల్ తదితర వాటిపై విన్యాసాలు ప్రదర్శించారు. ఇరుదేశాలకు చెందిన సుమారు 1000 మంది త్రివిధ దళాల సభ్యులు విన్యాపాల్లో పాల్గొని యుద్ధ సమయాల్లో నిర్వహించే విధులు, పోరాటాలను ప్రదర్శించారు. భారత్ భూభాగంలోకి ఉగ్రవాదుల చొరబాట్లు, భూభాగం ఆక్రమణకు ప్రయత్నిస్తున్న శత్రుదేశాలపై త్రివిధ దళాలు దాడులు చేసి, శత్రువు శిబిరాలపై ఆకాశ, జల, భూ భాగంపై నుంచి మెరుపు దాడులతో ఆట కట్టించారు. మెకనైజ్డ్ లాంగ్ ల్యాండింగ్ క్రాఫ్టలు, ల్యాండింగ్ ప్లాట్‌ఫారమ్ డాక్, ల్యాండింగ్ షిప్ ట్యాంకులు, యుద్ధ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, యుద్ధ ట్యాంకర్ల విన్యాసాలు ఎంతో అబ్బురపరిచాయి.





నౌకాదళం యుద్ధ హెలికాప్టర్ నుంచి రోప్‌తో కిందకు తిగుతున్న కమాండోలు, సముద్రంలో నుంచి యుద్ధానికి ఆయుధాలతో బయటకువస్తున్న సైనికులు

ఇరుదేశాల సంబంధాలు మరింత పటిష్ఠం

హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్

టైగర్ ట్రంప్ పేరిట ఇండియా-అమెరికా త్రివిధ దళాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలతో ఇరుదేశాల మధ్య స్నేహ పూర్వక వాతావరణం, బంధం మరింత బలపడుతుందని హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ పేర్కొన్నారు. యాంపీబీఎస్ విన్యాసాలను తిలకించేందుకు శుక్రవారం కాకినాడ తీరానికి ఇరుదేశాల త్రివిధ దళాల అధికారులతో కలసి వచ్చారు. ఇరుదేశాల అధికారులకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఘన స్వాగతం పలికారు. జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ ఏటా సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలతో కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. ఈ కసరత్తు వల్ల విన్యాసాల్లో ఇరుదేశాల త్రివిధ దళాలకు ఉన్న ప్రతిభ, మెళకువలను ప్రదర్శించి మరింత పటిష్ఠంగా ఉండేందుకు తోడ్పడుతుందన్నారు. మా బలగాలు మునుపెన్నడూ లేనంతగా సన్నిహితంగా పని చేస్తున్నాయన్నారు. టైగర్‌ట్రంప్ వంటి వ్యాయామాలు, కసరత్తు ద్వారా యునైటెడ్ స్టేట్స్ భారత్‌ల మధ్య పరస్పర భద్రతా లక్ష్యాలను సాధించేందుకు దోహదంచేస్తుందన్నారు. బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌డీపీవో దేవ రాజ్ మనీష్ పాటిల్, రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ పర్యవేక్షించారు.



జెన్నిఫర్ లార్సెన్‌తో కరచాలనం చేస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

జిల్లాలో 'చిన్నారి ఆరోగ్యం'కు శ్రీకారం

పోషణ అభియాన్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చిన్నారి ఆరోగ్యం కార్యక్రమానికి జిల్లాలో శ్రీకారం చుట్టామని, ఇందులో భాగంగా పోషకాహారలోపం, దీర్ఘకాలిక అనారోగ్యంతో ఉన్న పిల్లలను గుర్తించి వారి ఆరోగ్యం మెరుగుపరిచేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమం, డీఆర్‌డీఏ, వైద్య, ఆరోగ్యశాఖ తదితర సమన్వయశాఖల అధికారులతో చిన్నారి ఆరోగ్యం కార్యక్రమంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణ అభియాన్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ పోషకాహార లోపం ఉన్న, దీర్ఘకాలిక అనారోగ్యంతో ఉన్న పిల్లలను గుర్తించి సాధారణ స్థితికి తీసుకుని రావడంలో భాగంగా చిన్నారి ఆరోగ్యం కార్యక్రమానికి రూపకల్పన చేసినట్టు పేర్కొన్నారు. టీబీతో బాధపడుతున్న పిల్లలు, హెచ్‌ఐవీ, తలసేమియా, ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్న పిల్లలను గుర్తించి వారికి తగిన వైద్య సహాయం అందజేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎన్.వసుంధర, డీఆర్‌డీఏ, డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువయ్యేందుకే 'పల్లెకు పోదాం'

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత చేరువయ్యేందుకే బీజేపీ 'పల్లెకు పోదాం' కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన కాపవరంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని తమకు అందజేస్తే అధిష్టానికి తెలియజేసి పరిష్కరిస్తామన్నారు. అలాగే ప్రధాని మోదీ రాష్ట్రానికి ఏవిధంగా నిధులు అందజేస్తున్నారో వివరిస్తున్నామన్నారు. అనంతరం ఆయన గ్రామంలోని సచివాలయం, గ్రామీణ ఆరోగ్యకేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ ఎం.శివరామకృష్ణంరాజు, మండలాధ్యక్షుడు దుర్గారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: బీజేపీ గావ్ బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు రాజమహేంద్రవరం 12, 13 డివిజన్‌లలోని అంగన్వాడీ కేంద్రాన్ని, అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఇస్తున్న పౌష్టికాహారం పరిశీలించారు. పాలు, గుడ్లు, బాలామృతం, బాలింతలకు ఇచ్చే సరుకుల నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం అర్బన్‌హెల్త్ సెంటర్‌ను సందర్శించి వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడారు. వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందులు సమాచారం తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, అసెంబ్లీ కన్వీనర్ యెనుముల రంగబాబు, కురగంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో అజాత శత్రువు గట్టి


మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డితో సత్యనారాయణ(ఫైల్)

నేడు సంస్మరణ సభ

కడియం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో అజాత శత్రువుగా కడియపులంక మాజీ సర్పంచ్ గట్టి సత్యనారాయణమూర్తికి పేరుంది. కడియం ఉమ్మడి పంచాయతీగా ఉన్న సమయంలోనే కడియపులంక పంచాయతీ బుర్రిలంకకు చెందిన సత్యనారాయణమూర్తి వార్డు మెంబర్‌గా గెలుపొందారు. అప్పటి నుంచి సర్పంచ్, సొసైటీ అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్, వేమగిరి నీటి సంఘ అధ్యక్షుడు, ఆలమూరు నీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పదవులతో పాటు సుదీర్ఘకాలం కడియం నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చేశారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాంతానికి వచ్చిన సందర్భాల్లో పలుమార్లు సత్యనారాయణమూర్తి ఇంటికి వచ్చారు. మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావుకు ముఖ్య అనుచరుడిగా ఉండే సత్యనారాయణమూర్తికి మాజీ మంత్రి సంగీత వెంకటరెడ్డి, మాజీ ఎంపీ ఉండవిల్లి అరుణకుమార్, ప్రస్తుత పర్యాటక మంత్రి కందుల దుర్గేష్‌తో మంచి సంబంధాలున్నాయి. ఆయన చిన్నకుమారుడు నర్సయ్య కడియపులంక సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. పెద్ద కుమారుడు సుబ్బారావు ప్రత్యక్ష రాజకీయాల్లో లేకున్నా నియోజకవర్గ పరిధిలో అన్ని పార్టీల నాయకులతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు

కడియం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో లాభదాయకంతో పాటు మంచి పంట దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు తెలిపారు. శుక్రవారం మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ తాను సుమారు పదెకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి, నువ్వులు, అపరాలు వంటి పంటలను ఎరువులు, పురుగు మందులు వాడకుండా సహజ సిద్ధంగా సాగు చేస్తున్నట్టు చెప్పారు. డీపీఎం మాట్లాడుతూ ప్రకృతి సాగుతో రైతులకు తక్కువ ఖర్చుతో మంచి పంట, అధిక దిగుబడి సాధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం వలీ, మద్దూరు సర్పంచ్ ఉప్పులూరి బాబ్జి, ఎంపీటీసీ గొల్లపల్లి శ్రీను, ఏవో ద్వారకాదేవి, హెచ్‌వో సుధీర్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలపై తేనెటీగల దాడి

సీతానగరం, ఏప్రిల్ 11: మండలంలోని వంగలపూడి గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలపై తేనెటీగలు దాడిచేశాయి. శుక్రవారం గ్రామంలో కాలువ పూడికతీత పనులకు 130 మంది కూలీలు వెళ్లారు. అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు ప్రారంభించారు. ఐదుగురు కూలీలు కలిసి కాలువపై ఉన్న చెట్లను తొలగించే క్రమంలో ఆ చెట్లకు ఉన్న తెనెపట్టుకు ఉన్న ఈగలు ఒక్కసారిగా ఎగసిపడడంతో ఉపాధి కూలీలు పరుగులుపెట్టారు. ఈ క్రమంలో కోడెల్లి గంగరాజు, ఆరుగుల వెంకటేశ్వర్లు, ఓరిగంటి పాప గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఏపీవో బి.సత్యవతి సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ముగ్గురినీ సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యసేవలు అందించారు.

మధ్యాహ్న భోజన పథకంలో

కోడిగుడ్ల నాణ్యతపై తనిఖీలు

అనపర్తి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లేని గుడ్లు సరఫరా చేస్తున్నారని మండలంలోని పలు పాఠశాలల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం మండలంలోని పొలమూరులో బుద్ధవరపు చారిటబుల్ ట్రస్టు వంటశాలను ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు ద్వారా తయారైన ఆహార పదార్థాలను వీరు రుచి చూశారు. గుడ్ల విషయంపై ట్రస్టు ప్రతినిధిని ఆరా తీశారు. రోజుకు సుమారు 4వేల గుడ్లు వినియోగిస్తున్నామని, వీటిలో సుమారు 400వరకు దెబ్బతింటున్నాయని నాగిరెడ్డి అధికారులకు తెలిపారు. గుడ్లు సరఫరా చేస్తున్న వారిని అడుగుతున్నామని అయినా నాణ్యమైన గుడ్లు రావడం లేదని వివరించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

వైద్య విద్యలో పారామెడికల్ కోర్సులకు ప్రాధాన్యం

రాజానగరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యలో పారా మెడికల్ కోర్సులు ప్రాధాన్యాన్ని సంతరించు కుంటున్నాయని జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్ అన్నారు. శుక్రవారం జరిగిన జీఎస్ఎల్ పారా మెడికల్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. వైద్య చికిత్సల్లో వేర్వేరు విభాగాల పారామెడికల్ వృత్తి నిపుణుల ప్రాధాన్యం పెరుగుతోందని, వైద్యుల సలహాలు, సూచనలను అమలు చేయడంలో పారామెడికల్ సిబ్బంది సర్వీసుల వల్ల రోగులకు సకాలంలో చికిత్సలు అందించడంతో రోగులు త్వరగా కోలుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాధిక, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మిశ్రా, సూపరింటెండెంట్ టీవీఎస్‌పీ మూర్తి పాల్గొన్నారు.

పాత సోమాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ సోము



రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): శ్యామలానగర్‌లోని పాత సోమాలమ్మ అమ్మవారిని బీజేపీ నాయకుడు ఎమ్మెల్సీ సోము వీర్రాజు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్ పూర్ణకుంభ స్వాగతాన్ని అందించి ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అనంతరం వీర్రాజును సతీష్ తదితర నాయకులు సత్కరించి, అమ్మవారి జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, యెనుముల రంగబాబు, కూరగంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుతో సుపరిపాలన: నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ద్వారా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పీరా రామచంద్రపురం, కొప్పవరం, మహేంద్రవాడ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనపర్తిలోని బాలికోన్నత పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఖోఖో కోర్టు, లాంగ్ జంప్ కోర్టులను ప్రారంభించి, లైబ్రరీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు సత్తి దేవదానరెడ్డి, కర్రి బులిరెడ్డి, సర్పంచ్ తేతల సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కర్రి శేషారత్నం, హెచ్‌ఎం కర్రి కళ్యాణి పాల్గొన్నారు.

మహిళోద్ధరణకు పూలే కృషి


నన్నయ వర్సిటీలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

- నన్నయ రిజిస్ట్రార్ సుధాకర్
- మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి
- పలువురు నాయకుల నివాళి

దివాన్‌చెరువు, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి) :అంటరానితనం, కలవ్యవస్థ నిర్మూలనతో బాటు మహిళోద్ధరణకు జ్యోతిరావు పూలే చేసిన కృషి ఎంతో గొప్పదని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నయ వర్శిటీలో పూలే చిత్రపటానికి రిజిస్ట్రార్ పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందడానికి సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేశారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి పని చేశారని చెప్పారు. వ్యక్తిగత జీవితాలను సమాజం కోసం త్యాగం చేసి నలుగురికి ఉపయోగపడే విధంగా మంచి పనులు చేసిన ప్రతీఒక్కరూ మహనీయులుగా కీర్తింపబడతారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎన్.ఉదయభాస్కర్, పి.విజయనిర్మల, పి.వెంకటేశ్వరరావు, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ఎల్ఐసీ డివిజన్ కార్యాలయంలో ఓబీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి మాట్లాడుతూ సామాజిక న్యాయం, మహిళా సాధికారత, అందరికీ ఉచిత విద్య కోసం పూలే దంపతులు వారి జీవితాలను త్యాగం చేశారన్నారు. మార్కెటింగ్ మేనేజర్ సాహూ సత్యనారాయణ, ప్రొడక్ట్ మేనేజర్ బి.సురేష్, సేల్స్ మేనేజర్ బి.శ్రీనివాస్, ఓఎస్ మేనేజర్ రేఖ, పర్సనల్ మేనేజర్ కృష్ణ, ఓబీసీ సంఘ నాయకులు ఏకే విశ్వనాథ్, బి.శ్రీనివాసరావు, మోలేటి రమేష్ బాబు, శిరీష పాల్గొన్నారు.

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎంపీపీ తేతలి సుమ పూలమాలతో నివాళులర్పించారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు పూలే కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సాయికుమార్, సిబ్బంది మంగరాజు, ఉమామహేశ్వరరెడ్డి, పప్పు శ్రీను పాల్గొన్నారు.

అనపర్తి: స్థానిక కెనాల్ రోడ్డులోని జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే అంటరానితనం, కులవ్యవస్థపై పోరాటం సాగించిన యోధుడని అన్నారు. ఆయన తీసుకువచ్చిన అనేక సంస్కరణల వల్ల నేడు అనేక మంది స్వేచ్ఛాయువులు పీలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, సర్పంచ్‌లు వారా కుమారి, గిరిడా గంగాభవాని, గొల్లు హేమతులసి, కర్రి శేషారత్నం, మామిడిశెట్టి శ్రీను, కర్రి బులిరెడ్డి, షేక్ దరియా సాహేబ్, బాసి పాల్గొన్నారు.

కడియం: మండలంలోని జేగురుపాడులో జ్యోతిరావు పూలే విగ్రహానికి సర్పంచ్ యాదల స్టాలిన్ పూలమాలలతో నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా సాధికారత సాధించేందుకు, సామాజిక అసమానతలను రూపు మాపేందుకు పోరాడిన సంఘ సంస్కర్త పూలే అని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, బీసీ నాయకులు మారిశెట్టి నాగన్న, బుడ్డిగ గణపతి, బుడ్డిగ రాంబాబు, బుడ్డిగ లక్ష్మణరావు, అంగర రాజు, బోడా అచ్యుత్ పాల్గొన్నారు.

రాజానగరం: మండలంలోని సూర్యారావుపేటలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ పూలే బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన సంస్కర్త, కుల వ్యవస్థ నిర్మూలనలో ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ మేకల లక్ష్మీపతిరావు, మాల ఐక్యవేదిక కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: మాజీ ఎంపీ, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ కార్యాలయంలో జరిగిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో గూడూరి శ్రీనివాసరావు, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

అధికారులతో సమీక్షల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ


కోరుకొండ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం/ సీతానగరం/కోరుకొండ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో వివిధ శాఖల అధికారులతో పలు కీలక అంశాలపై ఆయన సమీక్షించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలన్నారు. గుర్తించిన సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు చర్య లు చేపడతామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పంత రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికల అభివృద్ధి, కమ్యూనిటీ భవనాలు తదితర సదుపాయాల కల్పనపై నివేదికను తయారు చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సదరు నివేదికను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మేజర్ డ్రైన్లపై డీపీఆర్ తయారు చేసి గ్రామాల వారీగా అందించాలని కార్యదర్శులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులతోను వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి తనను కూడా అందులో చేర్చాలని సూచించారు. దీని వల్ల కమ్యూనికేషన్ బాగుంటుందని, సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారం చూపేందుకు వీలుంటుందని ఎమ్మెల్యే అన్నారు. త్వరలోనే రాష్ట్రంలో వాటర్ గ్రిల్ పథకం రాబోతుందని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించాలంటే పైపు లైన్ ఎక్కడ వేయాలో నివేదిక తయారు చేయాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. సీతానగరంలో జరిగిన సమావేశంలో ముందుగా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే బత్తుల పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూడు మండలాల్లో జరిగిన సమావేశాల్లో ఎంపీడీవోలు జేఏ ఝాన్సీ, భారతి, బత్తిన అశోక్‌కుమార్, ఈవోపీఆర్డీలు వాణి, మూర్తి, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, కడలి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు చిట్టూరి రంగారావు, పోలిన కృష్ణ, బీజేపీ మండలాధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధికి కూటమి పెద్దపీట: గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి కూటమి పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలపారు. రూరల్ మండలం కాతేరులో రూ. కోటి 37 లక్షల నిధులతో రెండు వాటర్‌ట్యాంక్‌లను, 55 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, ఏపీపీఎం సౌజన్యంతో రూ. 20 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన రెండు ట్రాక్టర్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పేపరుమిల్లు ఈడీ ముఖేష్‌జైన్, గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ బి వెంకటగిరి, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధం: మధు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధమని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో మైనార్టీలు, దళితులు, క్రైస్తవులకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. రాజమహేంద్రవరంలోని జట్ల సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బీజేపీ తన హిందుత్వ మతోన్మాద అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతూ అనేక దాడులు చేస్తున్నట్టు చెప్పారు. వక్ఫ్‌చట్ట సవరణ ద్వారా ముస్లింల ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడికి తలపెట్టారని, ఈ చట్టం ముస్లింల ఆస్తులు కబ్జా చేయడానికే తప్ప వారి అభివృద్ధికి కాదని పేర్కొన్నారు. కార్మికులకు వ్యతిరేకమైన నాలుగు లేబర్‌కోడ్లకు వ్యతిరేకంగా మే 20న ఒక రోజు సమ్మెను అన్ని వర్గాల వారు జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సంఘం కార్యదర్శి సప్ప రమణ, దేముడుబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు సురక్షిత తాగునీరందించాలి

సంక్షేమ వసతి గృహాల పరిశీలనలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు సంక్షేమ వసతి గృహాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. మల్లయ్య పేటలోని సాల్వేషన్ ఆర్మీ సన్‌షైన్, బాబానగర్‌లోని గుణపల్లి లీల ఆనంద్ ట్రస్ట్ మిషన్ గ్రేస్ హోమ్, హోమ్ ఫర్ బాయ్స్, షాలోమ్ ఔట్రీచ్ మినిస్ట్రీస్, చిల్డ్రన్ హోమ్ ఫర్ గర్ల్స్ వసతి గృహాల్లోని వసతులను గమనించారు. విద్యార్థులకు సురక్షిత తాగునీరు, పౌష్టికాహారం అందించాలన్నారు. పరిశుభ్రత పాటించాలని చెప్పారు. భవనాలకు మరమ్మతులు ఉంటే వెంటనే బాగు చేయించాలని, విద్యార్థులకు వైద్య సహాయం అవసరమైన సమయంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించవద్దని ఆమె ఆదేశించారు. వసతి గృహంలో ఎలాంటి సమస్యలు ఉన్నా, న్యాయ సహాయం అవసరమైనా తమను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.



4 సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లు

- 4 రీచ్‌లకు 124 దరఖాస్తులు
- రూ.35కే కోట్ చేసిన వైనం
- లాటరీ ద్వారా కేటాయింపులు
- వారం రోజుల్లో ఇసుక తీత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గోదావరి ఇసుక ర్యాంపుల్లో నాలుగు రీచ్‌లకు సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లుగా అనుమతిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో మొత్తం పది సెమీ మెకనైజ్డ్ రీచ్‌లను గుర్తించగా అందులో జిల్లా అవసరాలకు నాలుగు రీచ్‌లకు టెండర్లు పిలిచారు. బ్రిడ్జిలంక, పక్కిలంక రీచ్‌లకు 43 దరఖాస్తులు, చిడిపికి 42, ఆరికరేవులకు 48, పురుషోత్తపల్లికి 29 మొత్తం 162 మంది టెండర్ల దాఖలు చేశారు. అందులో 124 దరఖాస్తులు అర్హత సాధించాయి.ఈ 124 దరఖాస్తుదారులు టన్నుకు రూ.35 మాత్రమే కోట్ చేయడంతో అధికారులు లాటరీ తీశారు. ప్రక్కిలంక రీచ్ ఎనర్జీవో ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, డీపీ ర్యాంప్ గాలి సుబ్బరాజు కనస్ట్రక్షన్ కంపెనీ, ఆరికరేవుల కేవీవీఎస్ఎన్ ఇన్‌ఫ్రా (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, పురుషోత్తపల్లి శ్రీ సాయిబాలాజీ కనస్ట్రక్షన్స్‌కు దక్కాయి. ఈ ర్యాంప్‌లను వారం రోజుల్లో నిర్వాహకులకు అప్పగించి ఇసుక తీత ఆరంభిస్తారని జేసీ ఎస్.చిన్నరాముడు ,జిల్లా మైన్స్ అధికారి పణిభూషణ్ రెడ్డి తెలిపారు. ఈ ర్యాంప్‌ల నుంచి మొత్తం 24 లక్షల 6 వేల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యమవుతుందని స్పష్టం చేశారు. మునికూడలి పట్టాభూములకు చెందిన ర్యాంప్‌లను కొన్ని కారణాల వల్ల వాయిదా వేశారు. మరొక ఐదు మెకనైజ్డ్ రీచ్‌లను ఇతర జిల్లాలకు కేటాయించారు. పెండ్యాల రీచ్ పశ్చిమ గోదావరి, కుమారదేవం రీచ్ విశాఖపట్నం అవసరాలకు, తాడిపూడి రీచ్ ఏలూరు జిల్లా అవసరాలకు ,సింగవరం రీచ్ అనకాపల్లి అవసరాలకు, కాటవరం రీచ్ కాకినాడ అవసరాలకు కేటాయించినట్టు తెలిపారు.

కనుల నిండుగా.. స్వామిని చూడగా!



వాడపల్లి వెంకన్న తెప్పోత్సవం శుక్రవారం కన్నుల పండువగా సాగింది. పుష్కరిణిలో తెప్పపై స్వామి అమ్మవార్లు భక్తులకు ప్రత్యేక దర్శనమిచ్చారు.. ఆపద మొక్కులవాడా వాడపల్లి వెంకన్నా అంటూ భక్తజనం కీర్తించారు.. స్వామిని కన్నులారా చూసి తరిం చారు. ఆ దృశ్యాలివి..
- ఆత్రేయపురం



బిల్లుకు దారేది!

- బిల్లు.. చెల్లింపు నిల్
- ఉమ్మడి జిల్లాలో రూ.400 కోట్లు
- భారీగా ఆర్అండ్‌బీ బకాయిలు
- అమలాపురం రూ.150 కోట్లు
- రాజమండ్రి డివిజన్ రూ.30 కోట్లు
- ప్రభుత్వ బాకీలు రూ.90 కోట్లే
- అత్యధిక బాకీలు వైసీపీలోనివే
- ఇటీవల రూ.290 కోట్లు చెల్లింపు
- పాత బాకీలు ఆపండి
- ప్రభుత్వం తాజా నిర్ణయం
- కాంట్రాక్టర్ల గగ్గోలు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్అండ్‌బీ రహదారుల బిల్లుల బాకీలు భారీగా పేరుకు పోయాయి. పూడ్చిన గుంతలు, ఇతర మరమ్మతులకు బిల్లులు ఆగిపోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రహదారులకు సంబంధించి గుంతలు పూడ్చాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో సంక్రాంతి వరకు ఉమ్మడి జిల్లాలో దాదాపుగా ఈ పనులన్నీ పూర్తిచేశారు. ఉమ్మడి జిల్లాలో రహదారుల బిల్లుల బాకీలు రూ.400కోట్లకుపైగానే పేరుకుపోయాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వ హయాంలో గుంతలు పూడ్చిన పనులకు సంబంధించిన బిల్లులు రూ.90 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికలు దగ్గరపడ్డ సమయంలో హడావుడిగా రహదారుల మురమ్మతులు చేపట్టారు. కానీ బిల్లులను మాత్రం జగన్ నిలిపివేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారేసమయానికి ఉమ్మడి జిల్లాలో ఆర్అండ్‌బీ బాకీలు రూ.600కోట్ల వరకు ఉన్నాయి. అయితే కాంట్రాక్టర్ల ఆవేదన విన్న సీఎం చంద్రబాబు పాతబాకీల్లో రూ.290 కోట్లు వరకు విడుదలయ్యేలా ఆదేశాలు జారీ చేశారు. ఇవిపోను తాజా పనులతో కలిపి మొత్తం బాకీలు రూ.400 కోట్ల వరకు ఉన్నాయి. అయితే నిధుల కొరతతో గతేడాది వరకు పేరుకుపోయిన బిల్లుల బాకీలు ఇకపై చెల్లించకూడదని సర్కారు తాజాగా నిర్ణయం తీసుకోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు.

అప్పుడలా వదిలేశారు...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆర్అండ్‌బీ రోడ్లు నిర్మించిన కాంట్రాక్టర్లు గగ్గోలు

గత పనులతో మనకేం సంబంధం

పెడుతున్నారు. గత ప్రభుత్వంలో బిల్లులు రాక అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న పరిస్థితులు నెలకొనగా, ప్రభుత్వం మారడంతో కొంత ఒడ్డునపడ్డామని భావిస్తోన్న కాంట్రాక్టర్లు సర్కారు తాజా నిర్ణయంతో తలపట్టుకుంటున్నారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కడికక్కడ రహదారులను గాలికొదిలేశారు. ప్రజలు,పార్టీలు ఆందోళనలు చేసినా అప్పట్లో జగన్ సర్కారు చెవికెక్కించుకోలేదు. అయితే గతేడాది అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో ఓట్ల కోసం అప్పటికప్పుడు వైసీపీ ప్రభుత్వం కొన్ని కీలక రహదా రులకు మరమ్మతులు చేపట్టింది. టెండర్లు పిలిచి పనులు చేయించింది. ఎన్నికల ఏడాది కావడంతో చేసిన పనులకు బిల్లులు వస్తాయనే ఆశతో చాలా మంది కాంట్రాక్టర్లు అప్పులు చేసి పనులు చేశారు. తీరా జగన్ ప్రభుత్వం బాకీలు చెల్లించకుండా చేతులెత్తేసింది.ఈలోపు ఎన్నికలు రావడంతో వైసీపీ ఓడిపోయింది. దీంతో కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది. అప్పట్లో చేసిన పనులకు సంబంధించి రూ.600 కోట్ల వరకు బిల్లులు పేరుకుపోయాయి. ఈ లోపు ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్లు అధికారుల చుట్టూ తిరిగారు. విషయం సీఎం చంద్రబాబుకు వివరించారు. కాంట్రాక్టర్ల పరిస్థితిని అర్థం చేసుకున్న సీఎం బాకీల్లో కొంత విడుదలకు అధికారులను ఆదేశించారు. దీంతో గతేడాది చివర్లో మొత్తం రూ.600 కోట్ల బాకీలకు గాను రూ.290 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. దీంతో కొంత వరకు కాంట్రాక్టర్లు ఒడ్డున పడ్డారు.ప్రభుత్వం మారిన తర్వాత రహదారుల దుస్థితిపై సమీక్షించిన సీఎం చంద్రబాబు అనేక రహదారుల పరిస్థితి దయనీయంగా ఉండడం గుర్తించారు. ఎక్కడెక్కడ ఏయే రహదారులకు మరమ్మతులు, గుంతలు పూడ్చాలో నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. దీంతో జిల్లాలో గుర్తించిన రహదారుల గుంతలు పూడ్చే పనులు ఈ ఏడాది ఫిబ్రవరి వరకు చేపట్టారు. ఇందుకు రూ.150 కోట్ల వరకు ఖర్చయింది. అయితే వీటికి చెల్లింపులు చేయగా ఇంకా రూ.90 కోట్ల వరకు బాకీలు పేరుకుపోయాయి. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో బిల్లుల చెల్లింపు కష్టంగా మారింది. ఉన్నంతవరకు ప్రభుత్వం అతికష్టంపై ఒక్కో బిల్లు చెల్లించుకువస్తున్నా ఆర్అండ్ బాకీలు క దలక పోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు.

అత్యధికం అక్కడే..

మొత్తం పేరుకుపోయిన రూ.400 కోట్ల బాకీల్లో కాకినాడ ఆర్అండ్‌బీ డివిజన్‌కు సంబంధించి రూ.40 కోట్ల వరకు బిల్లులు పేరుకు పోయాయి. పెద్దాపురం ఆర్అండ్‌బీ డివిజన్ పరిధిలో రూ.35 కోట్లు, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా(అమలాపురం డివిజన్)లో రూ.150 కోట్లు, రాజమహేంద్రవరం ఆర్అండ్‌బీ డివిజన్ పరిధిలో రూ.30 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ.20 కోట్లు, రాజానగరం-సామర్లకోట ఏడీబీ రోడ్డుకు సంబంధించి రూ.30 కోట్లు బకాయిలు ఉన్నాయి. అయితే ఇందులో సింహభాగం గత ప్రభుత్వ హయాంలోవే. మరోపక్క చంద్రబాబు సీఎం అయిన తర్వాత ఉమ్మడి జిల్లాలో అధ్వాన రహదారులపై చలించిపోయారు. యుద్ధ ప్రాతిపదికన వీటిని గుర్తించి గుంతలు పూడ్చేలా ఆదేశాలు జారీచేశారు. ఇందుకు రూ.150 కోట్లకు పైగానే ఖర్చయింది. వీటికి సంబంధించి కొంత చెల్లింపులు చేయగా ఇంకా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.90 కోట్ల వరకు బిల్లులు నిలిచిపోయాయి. అమలాపురం సర్కిల్ పరిధిలో రూ.38 కోట్లు, పెద్దాపురం రూ.12 కోట్లు, రాజమహేంద్రవరం రూ.16 కోట్లు,కాకినాడ ఆర్అండ్‌బీ డివిజన్‌లో రూ.24 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇదిలాఉంటే సకాలంలో బిల్లులు రాకపోవడం ప్రస్తుతం కొత్తగా టెండర్లు పిలవడానికి సిద్ధంగా ఉన్న కొన్ని రహదారుల నిర్మాణంపై ప్రభావం చూపుతోంది. కొత్త పనులకు అధికారులు అంచనాలు సిద్ధం చేయగా, టెండర్లు పిలవడానికి పాలనాపరమైన ఆమోదం కూడా లభించింది. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో వీటిని పిలిస్తే కాంట్రాక్టర్లు ఆసక్తి చూపరని అధికారులు భావిస్తున్నారు. దీంతో కొత్త ప్రాజెక్టులు ముందుకు కదలడంలేదు. ఇదిలా ఉంటే కొత్తగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.64 కోట్లు నిధులు మంజూరు చేస్తూ పాలనాపరమైన ఆమోదం ఇచ్చింది. వీటికి త్వరలో టెండర్లు పిలవబోతున్నారు. అయితే గతంలో నిలిచిపోయిన బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు ఒత్తిడి చేస్తుండడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని అధికారులు చెబుతున్నారు. మరోపక్క గతేడాది వరకు నిలిచిపోయిన పెండింగ్ బిల్లులకు సంబంధించి సీఎఫ్ఎంఎస్‌లో లోడ్ చేసిన బిల్లులను సైతం వెనక్కు తీసుకుని చెల్లింపులు నిలిపివేయాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో బాకీల పరిస్థితి ఏంటోనని అధికారులు, కాంట్రాక్టర్లు తలపట్టుకుంటున్నారు.




మంత్రి


చైర్మన్

జనసేనదే.. నిడదవోలు పీఠం

- అవిశ్వాస తీర్మానానికి అవకాశం లేదంటూ కలెక్టర్ ప్రకటన
- మంత్రి దుర్గేష్ ఓటుతో కలిసి 15కు చేరిన కూటమి బలం
- నిడదవోలు మునిసిపాలిటీలో జనసేన పాగా

నిడదవోలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఒక్క కౌన్సిలరూ లేరు..అయినా ప్రస్తుత నిడదవోలు పీఠం జనసేనదే.. వ్యూహ ప్రతి వ్యూహాలతో నిడదవోలు మునిసిపాలిటీపై జనసేన పట్టు సాధించింది.. మంత్రి దుర్గేష్ నియోజకవర్గంలో వైసీపీ జెండా పీకేసి జనసేన జెండా ఎగురవేసింది. నిడదవోలు మునిసిపాలిటీలో మొత్తం 28 మంది కౌన్సిలర్లు ఉండగా కూటమి తరపున టీడీపీకి ఉన్నది ఒక్క కౌన్సిలర్ మాత్రమే. మిగిలిన 27 మంది వైసీపీ కౌన్సిలర్లే.దీంతో తొలుత పీఠం వైసీపీదే. ఇదిలా ఉండగా గత సార్వత్రిక ఎన్నికల్లో నిడదవోలు నియోజకవర్గంలో కూటమి తరపున జనసేన నుంచి కందుల దుర్గేష్ ఎన్నికై రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.అనంతరం రాజకీయ పరిణామాలు ఒక్కొక్కటిగా మారిపోయాయి. వైసీపీ కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా జనసేన బాట పట్టారు. మంత్రి దుర్గేష్ వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో వైసీపీ ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానానికి సైతం అవకాశం లేకుండాపోయింది. ఈ మేరకు కలెక్టర్ ప్రకటన విడుదల చేయడంతో నిడ దవోలు మునిసిపాలిటీ జనసేన కైవసం చేసుకుంది. నిడదవోలు మునిసిపాలిటీలోని 28 వార్డులకు మార్చి 15వ తేదీ 2021లో ఎన్నికలు జరగ్గా 27 వార్డుల్లో వైసీపీ కౌన్సిలర్లు విజయం సాధించారు. ఒక్క వార్డులో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. దీంతో నిడదవోలు మునిసిపల్ కౌన్సిల్ వైసీపీ వశమైంది.అప్పటి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు చైర్మన్ పదవీ కాలాన్ని భూపతి ఆదినారాయణకు రెండున్నరేళ్లు.. కామిశెట్టి వెంకట సత్యనారాయణకు రెండేళ్లు.. మిగిలిన కాలం పువ్వల రతీదేవి పదవి చేపట్టేలా ఒప్పందం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో శ్రీనివాస్ నాయుడు ఓటమి పాలై కందుల దుర్గేష్ ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో రాజకీయ పరిణామాలు మారిపోయాయి. చైర్మన్ కుర్చీ వివాదం ముదిరి పాకాన పడింది. ఇదిలా ఉండగా మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణతో పాటు మరో 8 మంది కౌన్సిలర్లు జనసేన కండువా కప్పుకున్నారు. ఇంకా 19 మంది సభ్యుల బలం వైసీపీకి ఉంది.ఈ ఏడాది మార్చి 18వ తేదీ నాటికి కౌన్సిల్ ఏర్పడి నాలుగేళ్లు పూర్తి కావడంతో వైసీపీ కౌన్సిలర్లు చైర్మన్ పీఠంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవకాశం ఇవ్వాలంటూ కలెక్టర్ పి.ప్రశాంతి, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితలకు వినతిపత్రం అందజేశారు. ఈ పరిణామంతో ఒక్కొక్కరుగా మరో నలుగురు కౌన్సిలర్లు జనసేనకు జైకొట్టారు. దీంతో పూర్తిగా జనసేన మెజార్టీ 13కు చేరుకుంది. వీరికి తోడు మరొక టీడీపీ కౌన్సిలర్ ఉండడంతో 14 కాగా మంత్రి దుర్గేష్‌కు కౌన్సిల్‌లో ఓటు ఉండడంతో జనసేన బలం 15కు చేరుకుంది. చైర్మన్ పీఠంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలంటే 15 మంది సభ్యుల బలం ఉండాలి. ప్రస్తుతం వైసీపీ బలం 14కి పడిపోయింది.దీంతో అవిశ్వాసానికి అవకాశం లేకుండాపోయింది. మెజార్టీ కౌన్సిలర్లు లేకపోవడంతో అవిశ్వాస తీర్మానానికి అవకాశం లేదంటూ శుక్రవారం కలెక్టర్ ప్రకటన విడుదల కావడంతో నిడదవోలు మునిసిపాలిటీ జనసేన కైవసం చేసుకుందని జనసేన పార్టీ వర్గాలు ప్రకటించాయి. నిడదవోలు మునిసిపాలిటీలో పరిణామాలపై ఏప్రిల్ 5వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనమే నిజమైంది. ఇదిలా ఉండగా నిడదవోలులో శనివారం మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో జనసేన వర్గాలు నిడదవోలు మునిసిపల్ కౌన్సిల్‌ను జనసేన కైవసం చేసుకుందనే విషయాన్ని బహిరంగంగా ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

1354 ఎకరాల్లో అనధికార లేఅవుట్లు

చైర్మన్ బీవీఆర్ చౌదరి, వైస్ చైర్మన్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రుడా పరిధిలో 1354 ఎకరాల్లో అనధికార లేఅవుట్ల వివరాలు సేకరించామని, ఆయా గ్రామ పంచాయతీ సెక్ర టరీలకు నోటీసులు ఇస్తున్నట్టు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి,వైస్ చైర్మన్ కేతన్‌గార్గ్ తెలిపారు. రుడా ఆఫీసులో శుక్ర వారం రుడా అధికారులతో కలిసి ఆయా పం చాయతీ సెక్రటరీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారం రోజుల్లో పంచాయతీ ల్లోని అనధికార లేఅవుట్లు గుర్తించి హెచ్చరిక బోర్డు లు పెట్టాలని ఆదేశించారు. ఎవరైనా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే తొర్రేడు, నరేంద్రపురం, హుకుంపేట, బొమ్మూ రు,దేవరపల్లి కార్యదర్శులు తీసుకున్న నిర్ణయాలపై వివరణ తీసుకున్నట్టు చెప్పారు.అనధికార లేఅవుట్లను రుడా కార్యాలయం ద్వారా క్రమబద్ధీకరించుకునే వీలుంటుందన్నారు. సమావేశంలో రుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జీవీఎస్ఎన్.మూర్తి, రుడా ప్లానింగ్ ఆఫీసర్ నార్కె. డిమిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.


రుడా కార్యాలయంలో అధికారులతో చర్చిస్తున్న చైర్మన్ బీవీఆర్ చౌదరి, వైస్ చైర్మన్ కేతన్‌గార్గ్

గ్యాస్ ధర తగ్గించాలని సీపీఎం నిరసన

కొవ్వూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరను తక్షణమే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం. సుందరబాబు మాట్లాడుతూ మోదీ పాలనలో మొత్తం 18 సార్లు ధరలు పెంచారన్నారు. గ్యాస్ సిలిండర్ ధర పెంచడం తగదన్నారు. ధర తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీర రవి, పి. చినబాబు, కె. కనకారావు, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు జ్యోతిరావు పూలే

జయంతి సభలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఇద్దరు వ్యక్తులను మాత్రమే మహాత్మ అని పిలుచుకోవడం జరుగుతుందని.. ఒకరు మహాత్మగాంధీ అయితే మరొకరు మహాత్మజ్యోతిరావు పూలే అని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పూలే 199వ జయంతిని నిర్వహించారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వారి పేరు ముందు మహాత్మ అని సంబోధించడమే వారికి సమాజం ఇచ్చిన గౌరవానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. అణగారిన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు పూలే అన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ సత్యాన్ని నమ్ముకుని ధర్మబద్ధంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మహనీయుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు.స్వయం ఉపాధి పథకాల అమలు నిమిత్తం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 144 మంది బీసీ తూర్పుకాపు,ఈబీసీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు రూ.352 లక్షలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 110 మంది విద్యార్థులకు పూలే సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో రూ.1.10 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కే.తిలక్ కుమార్,జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బి.శశాంక, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు,నయనాల కృష్ణారావు, ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, ఈఈ మాధవి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారులు ముత్యాల సుబ్బారావు, పి రామకృష్ణ పాల్గొన్నారు.


పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వాసు చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి తదితరులు

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

8 మంది బాలలకు హెచ్ఐవీ పరీక్షలు

నల్లజర్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒక గ్రామంలో బాల బాలికలను లైంగికంగా వేధించిన అదే గ్రామానికి చెందిన 60 ఏళ్ల వృద్ధుడు (హెచ్ఐవీ బాధితుడు)ను శుక్రవారం అరెస్ట్ చేసినట్టు సీఐ వై.రాంబాబు తెలిపారు.8 మంది విద్యార్థులకు హెచ్ఐవీ పరీక్షలు చేయించామని చెప్పారు. రిపోర్టులు ల్యాబ్ నుంచి రావాల్సి ఉందని తెలిపారు. రిపోర్టులు వస్తే గాని చిన్నారులకు హెచ్ఐవీ సోకిందా లేదా అనేది తెలియదన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

సీఎంను కలిసిన ముళ్లపూడి



నల్లజర్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు సీఎం చంద్రబాబును శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నల్లజర్లలో 500 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, వాటి నిర్మాణం కోసం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాల సమస్యను సీఎంవో ఆఫీసు కార్యదర్శి రాజమౌళికి సీఎం అప్పగించారని, త్వరలో సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఈయనతోపాటు తెలికిచర్ల టీడీపీ నాయకుడు సుంకర ప్రతాప్, తదితరులు ఉన్నారు.

'పట్టణాన్ని ముందుంచాలి'



మున్సిపల్ కమిషనర్‌కు మెమెంటో అందజేస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని అన్నిరంగాల్లో ముందుంచడానికి ప్రజలు, అధికారులు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. ఆస్తి పన్ను వసూలులో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడంపై శుక్రవారం మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్‌ను చైర్‌పర్సన్ మెమొంటో అందించి, అభినందించారు. ఆస్తిపన్ను వసూలుకు పాటుపడిన మేనేజర్ పి.సాయిబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యాం, వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు అభినందనలు తెలిపారు.

ఎన్‌ఎంయూ నిరసన



డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కొవ్వూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎన్‌ఎంయూ కార్యదర్శి ఎం. శివకుమార్ డిమాండ్ చేశారు. ఎన్‌ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం ఆ యూనియన్ నాయకులు నిరసన తెలిపారు. డిపో సెక్రటరీ ఎం. శివకుమార్, గ్యారేజీ సెక్రటరీ సీహెచ్ శివ, డిపో చైర్మన్ సీహెచ్ రమణ, జిల్లా కార్యదర్శి ఎస్‌డీ ముఖర్జీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి



పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి



నిడదవోలులో నివాళి అర్పిస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

కొవ్వూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక వేత్త జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, బర్ల శ్రీనివాసరావు, కాగిత రఘు, మాదిరెడ్డి సతీష్, మారిశెట్టి సతీష్, పెనుమాక జయరాజు, పొట్లూరి గాంధీ, మేడూరి వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. సుందరబాబు పాల్గొని మాట్లాడారు. బీరా రవి, కే. కనకారావు, సాకా పుల్లారావు, కే.వీరబాబు, గురునాథం, శేషగిరి, ఇందిర, చినబాబు పాల్గొన్నారు.

నిడదవోలు: మహాత్మాజ్యోతిరావు పూలే ఆశయాలను మనమంతా ముందుకు తీసుకెళ్లాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు సెంటరులో పూలే జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తిరుపతి సత్యనారాయణ, అంగర శ్యామ్‌గౌడ్, బైపే రాజేశ్వరరావు, కాళ్ల లక్ష్మణరావు, కరీమ్, ముప్పిడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: సామాజిక సంస్కరణలకు మహాత్మా జ్యోతిరావు పూలే నాంది పలికారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు అన్నారు. పూలే 198వ జయంతిని గోపాలపురంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొర్లపాటి రాము, జ్యేష్ట శ్రీనివాసరావు, జ్యేష్ట శ్రీధర్, నూతంగి దొరబాబు, పడమట శ్రీను, కూనపం ప్రసాద్ బాబు, ఎస్‌కే సికిందర్, వాసు, బాలిన రాము, రామలీలాధర్, మల్లిపూడి సుబ్బారావు, బుజ్జి, కొడమంచిలి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: సామాజిక సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేవీకే దుర్గారావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుమల దాసు, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, కార్యదర్శి రవికిషోర్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు పూడికను తీయాలి



సుగంధి చెరువును పరిశీలిస్తున్న ఏపీవో

తాళ్లపూడి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పెద్దేవంలోని చిన్న సుగంధి చెరువులో పూడిక తీత పనులు చేయాలని సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణను కోరారు. ఈ మేరకు ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో రమాదేవి శుక్రవారం విచ్చేసి చెరువును పరిశీలించారు. ఈమెతోపాటు ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.

అత్తను చంపుతానని బెదిరింపు... కోడలిపై కేసు నమోదు

కొవ్వూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అత్తను కొట్టి చంపుతానని బెదిరించిన కోడలిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... దొమ్మేరుకు చెందిన పోలినాటి దుర్గాప్రసాద్‌కు కాకినాడలోని జగన్నాథపురానికి చెందిన నాగమణితో వివాహం జరిగింది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో రెండు సంవత్సరాలుగా విడిగా ఉంటున్నారు. దుర్గాప్రసాద్ నిడదవోలులో ఉంటుండగా, అప్పుడప్పుడు నాగమణి దొమ్మేరులోని అత్త పోలినాటి మంగాదేవి ఇంటికి వచ్చి భర్త గురించి ఆరా తీస్తూ ఆమెతో గొడవపడి వెళ్తుంటుంది. ఈ నెల 8వ తేదీన నాగమణి వచ్చి అత్తను కొట్టి చంపుతానని బెదిరించడంతో మంగాదేవి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

జన్మదిన శుభాకాంక్షలు







కొవ్వూరు నియోజకవర్గ ప్రగతి ప్రధాత, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా,
అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ, అందరి శ్రేయస్సు కాంక్షించే మా ప్రియతమ నాయకులు
శ్రీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) గార్కి మా హృదయపూర్వక

జన్మదిన శుభాకాంక్షలు

శ్రీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) గారు
జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, ది. ఆంధ్రా సుగర్స్ లి., తణుకు

ముప్పిడి వెంకటేశ్వరరావు
కొవ్వూరు నియోజవర్గ శాసనసభ్యులు

కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) మండల పరిషత్ అధ్యక్షులు, కొవ్వూరు	**గారపాటి రామ చంద్రరావు** సీనియర్ టి.డి.పి. నాయకులు - పశివేదల

గారపాటి శ్రీనివాసరావు సీనియర్ టి.డి.పి. నాయకులు - పశివేదల	**యు.వి.ఎస్. నారాయణ** సీనియర్ టి.డి.పి. నాయకులు - తోగుమ్మి	**పొట్రు సిద్ధార్ధ శంకర్రావు (సిద్ధు)** మాజీ ఆత్మ ఛైర్మన్ - ఐ.పంగిడి	**బేతిన నారాయణ** సీనియర్ టిడిపి నాయకులు, పశివేదల **బేతిన కాశీ అన్నపూర్ణ భవాని** మాజీ సర్పంచ్, పశివేదల
నాయుడు వీర్రాజు & సాయి సీనియర్ టిడిపి నాయులు, మాజీ సర్పంచ్ **అంబటి నాగరాజు** MPTC మద్దూరు	**గారపాటి పోలిబాబు** సీనియర్ టిడిపి నాయకులు, దొమ్మేరు **గారపాటి శ్రీదేవి** మాజీ జెడ్.పి.టి.సి. దొమ్మేరు	**గారపాటి సూర్యచంద్రరావు** సీనియర్ టిడిపి నాయకులు - ధర్మవరం	**ఉండవల్లి రాజగోపాల్** టిడిపి నాయకులు - పశివేదల
చావా శ్రీనివాసరావు మాజీ అధ్యక్షులు PACS ఆరికిరేవుల	**యనమదుల శివరామకృష్ణ** సీనియర్ టిడిపి నాయకులు - ఆరికిరేవుల **గుత్తా వెంకటరమణ** సీనియర్ టిడిపి నాయకులు - ఆరికిరేవుల	**అల్లు అమరావతి** MPTC **కాలింకి రామకృష్ణ** గ్రామ తెలుగు రైతు కార్యదర్శి - ఆరికిరేవుల	**మంకిన వీరన్న & బ్రదర్స్** సీనియర్ టిడిపి నాయకులు - చిడిపి
మేణ్ణి పార్థసారధి టిడిపి నాయకులు - చిడిపి	**పాలడుగుల లక్ష్మణరావు** సర్పంచ్ - చిడిపి	**మద్దిపాటి సత్యనారాయణ** మాజీ వైస్ యం.పి.పి. - తోగుమ్మి	**కాకర్ల బ్రహ్మాజీరావు** సీనియర్ టిడిపి నాయకులు - పెద్దవాడపల్లి
శీని సుదర్శన్ సీనియర్ టిడిపి నాయకులు - వేములూరు	**అక్కిన రాంబాబు** అధ్యక్షులు: కొవ్వూరు మండల తెలుగు రైతు, వేములూరు	**ముళ్ళపూడి వి.వి.కాశీ విశ్వనాథం** టిడిపి నాయకులు -వేములూరు **అత్తిలి నాగరాజు** సీనియర్ టిడిపి బి.సి. నాయకులు - వేములూరు	**మరపట్ల కళాధర చక్రవర్తి** కొవ్వూరు నియోజకవర్గ టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జ్ - వేములూరు
జుజ్జవరపు రామకృష్ణ టిడిపి నాయకులు - వేములూరు **ఇమ్మణి ప్రసాద్** గ్రామ టిడిపి అధ్యక్షులు - వేములూరు	**కంటిపూడి శ్రీనివాస్** మాజీ సర్పంచ్ - నందమూరు **నందిగం సుధాకర్** టిడిపి నాయకులు - నందమూరు	**కంటిపూడి గోపిచంద్** ఉపాధ్యక్షులు: కొవ్వూరు మండల టిడిపి వాణిజ్య విభాగం, నందమూరు	**యలమాటి సత్యనారాయణ** మాజీ ఉపసర్పంచ్, పశివేదల **పరిమి మురళీ గణేష్** 3వ వార్డు మెంబర్, పశివేదల
తుంపల్లి సింహాచలం, సర్పంచ్ **కరిమజ్జి బాలకృష్ణ** MPTC పశివేదల	**కలగర సుబ్బారావు** సర్పంచ్,దొమ్మేరు **కలగర రామకృష్ణ** మాజీ అధ్యక్షులు PACS	**జొన్న బాలకృష్ణ** అధ్యక్షులు: కొవ్వూరు మండల తెలుగు యువత నందమూరి యువసేన - ఐ.పంగిడి	**ఆకుల వీర వెంకట సత్యనారాయణ** మాజీ సర్పంచ్ **అల్లం అప్పారావు** టిడిపి నాయకులు **చల్లా కృష్ణ** టిడిపి నాయకులు, మద్దూరులంక
ఎరుబండి వీర వెంకట్రావు **పెండ్యాల శ్రీనివాస్,** కాపవరం	**తోరం నగేష్** అధ్యక్షులు: కొవ్వూరు మండల టిడిపి వాణిజ్య విభాగం,	**గారపాటి రామకృష్ణ** మాజీ సొసైటి అధ్యక్షులు - దొమ్మేరు **గారపాటి శ్రీనివాసరావు** టిడిపి నాయకులు : దొమ్మేరుసావరం	**గారపాటి ప్రసాద్** టిడిపి నాయకులు **పెండ్యాల రామకృష్ణ పరమహంస** టిడిపి నాయకులు : దొమ్మేరుసావరం





జన్మదిన శుభాకాంక్షలు

నిస్వార్ధ ప్రజా నాయకులు, కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధి సంపూర్ణ సహాయ సహకారాలు
అందిస్తున్న మా ప్రియతమ నాయకులు ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్
శ్రీ పెండ్యాల అచ్యుత రామయ్య (అచ్చిబాబు) గారికి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

నామన పరమేశ్వరరావు తాళ్లపూడి మండల టిడిపి అధ్యక్షులు	**పట్టికూటి వెంకటేశ్వరరావు** అధ్యక్షులు, కొవ్వూరు మండల తెలుగుదేశం పార్టీ	**జి.జి.చలం** తెలుగుదేశం పార్టీ నాయకులు, కొవ్వూరు	**కొఠారు వెంకట్రావు** సీనియర్ టిడిపి నాయకులు, అన్నదేవరపేట	**అన్నమరెడ్డి సత్తిబాబు** తెలుగుదేశం పార్టీ నాయకులు, తిరుగుడుమెట్ట
నామా కొండబాబు తెలుగుదేశం పార్టీ నాయకులు, తాడిపూడి	**మద్దిపాటి ప్రకాశరావు** మాజీ సర్పంచ్, మలకపల్లి	**గారపాటి వెంకటకృష్ణ** తెలుగుదేశం పార్టీ నాయకులు, ధర్మవరం	**పొట్రు శ్రీనివాసరావు** తెలుగుదేశం పార్టీ నాయకులు, కొవ్వూరు	**కైగాల శ్రీనివాసరావు** తెలుగుదేశం పార్టీ నాయకులు, వేగేశ్వరపురం
ఎడ్రు నాగేంద్ర తెలుగుదేశం పార్టీ నాయకులు, తిరుగుడుమెట్ట	**చలపాటి ప్రకాష్** తెలుగుదేశం పార్టీ నాయకులు, రాగోలుపల్లి	**అల్లూరి రాంబాబు** తెలుగుదేశం పార్టీ నాయకులు, తిరుగుడుమెట్ట	**ఎల్లిన కాశీవిశ్వనాధం** తెలుగుదేశం పార్టీ నాయకులు, తిరుగుడుమెట్ట	**అన్నమరెడ్డి సోమశేఖర్** తెలుగుదేశం పార్టీ నాయకులు, తిరుగుడుమెట్ట
కాకర్ల వంశీ తెలుగుదేశం పార్టీ నాయకులు, గజ్జరం	**దండమూడి శేషు** తెలుగుదేశం పార్టీ నాయకులు, గజ్జరం	**నాయుడు హనుమంతరావు** తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రక్కిలంక	**పడమటి కృష్ణ** తెలుగుదేశం పార్టీ నాయకులు, పెద్దేవం	**కాసాని చిట్టిబాబు** తెలుగుదేశం పార్టీ నాయకులు, మలకపల్లి
రేకపల్లి ముత్యాలరావు తెలుగుదేశం పార్టీ నాయకులు, రావురుపాడు	**వల్లభనేని బుల్లబ్బాయి** తెలుగుదేశం పార్టీ నాయకులు, బల్లిపాడు	**సిద్దా దుర్గారావు** తెలుగుదేశం పార్టీ నాయకులు, రావురుపాడు	**కొఠారు జగపతి** తెలుగుదేశం పార్టీ నాయకులు, అన్నదేవరపేట	**గొరిజాల సురేష్‌బాబు** నీటి సంఘం అధ్యక్షులు, కుమారదేవం
సుంకవల్లి వెంకటేశ్వరరావు తెలుగుదేశం పార్టీ నాయకులు, కుమారదేవం	**యనమదల సుబ్రహ్మణ్యం** తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆరికిరేవుల	**గొరిజాల శ్రీనివాసరావు** తెలుగుదేశం పార్టీ నాయకులు, కుమారదేవం	**జి.హెచ్.ఎస్. ప్రసాద్ (బుజ్జి)** తెలుగుదేశం పార్టీ నాయకులు, కుమారదేవం	**మద్దిపాటి రామారావు** తెలుగుదేశం పార్టీ నాయకులు, మలకపల్లి





జన్మదిన శుభాకాంక్షలు

కొవ్వూరు నియోజకవర్గ ప్రగతి ప్రధాత, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా,
అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ, అందరి శ్రేయస్సు కాంక్షించే
మా ప్రియతమ నాయకులు
శ్రీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) గార్కి
(జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, ది. ఆంధ్రా సుగర్స్ లి., తణుకు)





జన్మదిన శుభాకాంక్షలు

ముప్పిడి వెంకటేశ్వరరావు
శాసనసభ్యులు, కొవ్వూరు నియోజకవర్గం

జొన్నలగడ్డ వెంకట సుబ్బరాయ చౌదరి
ద్విసభ్య కమిటీ సభ్యులు - కొవ్వూరు నియోజవర్గం

కంఠమణి రామ కృష్ణారావు
ద్విసభ్య కమిటీ సభ్యులు - కొవ్వూరు నియోజవర్గం

మద్దిపట్ల శివరామకృష్ణ
అధ్యక్షులు: కొవ్వూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్

అనుపిండి చక్రధరరావు
కొవ్వూరు

గొర్రెల శ్రీధర్
కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకులు

దాయన రామకృష్ణ
పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు - కొవ్వూరు

సూరపనేని సూర్యభాస్కర రామమోహన్ (చిన్ని)
మాజీ మున్సిపల్ ఛైర్మన్ - కొవ్వూరు

సూర్యదేవర రంజిత్
సీనియర్ టి.డి.పి. నాయకులు - కొవ్వూరు

కంఠమణి వెంకట నారాయణ
సీనియర్ టి.డి.పి. నాయకులు - కొవ్వూరు

పొట్రు శ్రీనివాసరావు
తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి - కొవ్వూరు

శ్రీశ్రీ గౌరీ స్టోన్ క్రషర్
ప్రొ : ఉండవల్లి శ్రీనివాస్ - కొవ్వూరు

పాలెంపాటి చినబాబు చౌదరి
డైరెక్టర్: కొవ్వూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్

కంఠమణి రామకిషోర్
డైరెక్టర్ : కొవ్వూరు కో-ఆపరేటర్ అర్బన్ బ్యాంక్

మద్దిపట్ల మురళీకృష్ణ
డైరెక్టర్ : కొవ్వూరు కో-ఆపరేటర్ అర్బన్ బ్యాంక్

మద్దిపట్ల సురేష్
టిడిపి నాయకులు, కొవ్వూరు

జొన్నలగడ్డ శ్రీనివాస్
శ్రీశ్రీ ఇన్‌ఫ్రా, టిడిపి నాయకులు,కొవ్వూరు

వేమగిరి వెంకట్రావు
డైరెక్టర్ : ఎస్.సి. కార్పొరేషన్

అర్జిలి రామకృష్ణ
బి.సి. సెల్ నియోజకవర్గ అధ్యక్షులు, కొవ్వూరు

పెనుమాక జయరాజు
క్లస్టర్ ఇన్‌చార్జ్ - కొవ్వూరు

పాలకుర్తి వంశీ
టిడిపి నాయకులు, కొవ్వూరు

మద్దుల వి.వి.సత్యనారాయణ
టిడిపి జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు - కొవ్వూరు

నాళం వి.వి. శ్రీనివాసరావు
మహాత్మగాంధీ బట్టల వర్తక సంఘం అధ్యక్షులు: కొవ్వూరు, దొమ్మేరు

రాజాన శ్రీనివాసరావు
బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, కొవ్వూరు

బర్ల శ్రీనివాసరావు
మాజీ కౌన్సిలర్, కొవ్వూరు

యం.చక్రపాణి
న్యాయవాది , కొవ్వూరు

రంబా హరిబాబు
పట్టణ టిడిపి సెక్రటరీ, కొవ్వూరు

కాకర్ల సత్యనారాయణ
పట్టణ తెలుగు యువత అధ్యక్షులు, కొవ్వూరు

దుద్దుపూడి శివరామకృష్ణ
పట్టణ తెలుగు రైతు అధ్యక్షులు, కొవ్వూరు

కాగిత రఘు
పట్టణ బి.సి.సెల్ అధ్యక్షులు, కొవ్వూరు

ఇమ్మణి శిరీష
పట్టణ మహిళా టిడిపి అధ్యక్షురాలు, కొవ్వూరు

గెల్లా సురేష్
నియోజకవర్గ ఐ.టి.డి.సీ. అధ్యక్షులు

బొండాడ సత్యనారాయణ
1వ వార్డు కౌన్సిలర్, కొవ్వూరు

కిల్లాని వీర వెంకట లక్ష్మి
19వ వార్డు కౌన్సిలర్, కొవ్వూరు

పాలూరి నీలిమ
7వ వార్డు కౌన్సిలర్, కొవ్వూరు

కండెల్లి రామారావు
16వ వార్డు కౌన్సిలర్, కొవ్వూరు

మర్రి రామచంద్రరావు
18వ వార్డు కౌన్సిలర్, కొవ్వూరు

మురుకొండ రమాదేవి
23వ వార్డు కౌన్సిలర్, కొవ్వూరు

కొక్కిరిపాటి వెంకటేష్
పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు , కొవ్వూరు

పొట్లూరి గాంధీ
ఎస్సీ సెల్ అధ్యక్షులు , కొవ్వూరు

మొహమ్మద్ బహదూర్
పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు , కొవ్వూరు

ముప్పన శౌర్య
పట్టణ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు , కొవ్వూరు

కంటిపూడి వంశీకృష్ణ
పట్టణ ఐ.టిడిపి అధ్యక్షులు , కొవ్వూరు

కొవ్వూరు నియోజకర్గ టిడిపి పార్టీ కార్యాలయ ఉద్యోగులు మరియు సిబ్బంది